


PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి : 05 సంచిక : 124 పేజీలు : 8




ఆదివారం12-10-2025 వెల : 5/-

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD

# తెలంగాణలో మరో సర్వే




2లో

### అందరు భాగం కావాలని రాష్ట్ర ప్రభుత్వం పిలుపు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) రాష్ట్రంలో మరో సర్వే ప్రారంభం అయింది.తెలంగాణ రైజింగ్ విజన్-2047 పేరుమీద సిటిజన్ సర్వే చేపట్టింది. ఈ సర్వే అక్టోబర్ 10 శుక్రవారం ప్రారంభం కాగా అక్టోబర్ 25వ తేదీ వరకు జరగనుంది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు, రాష్ట్రాలు 2047 నాటికి లక్ష్యాలను నిర్దేశించుకోగా 2047 నాటికి తెలంగాణ రాష్ట్రం ఎలా ఉండాలని కోరుకుంటున్నారో ప్రజల అభిప్రాయాలు, సూచనలను ఈ సర్వే ఆధారంగా ఆన్ లైన్ లో

# కొండా Vs పొంగులేటి.. టెండర్ వార్



### ఢిల్లీకి చేరిన పంచాయితీ

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి టైం బాగా లేనట్టు కనిపిస్తోంది. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక, స్థానిక సంస్థల ఎన్నికలు, బీసీ రిజర్వేషన్ అంశంపై న్యాయపరమైన చిక్కులు చుట్టుముట్టాయి. వీటితోనే ఉక్కిరిబిక్కిరి అవుతున్న టైంలో మంత్రుల పంచాయితీ కొత్త తలనొప్పిగా మారుతోంది. ఇప్పటికే పలువురు మంత్రుల మధ్య ఉన్న విభేదాలతో సతమతమవుతున్న క్రమంలో కొందరు నేరుగా మీడియా ముందే రచ్చ రచ్చ చేస్తున్నారు. దాన్ని పరిష్కరించి హమ్మయ్య అనుకునే లోపు మరో ఇద్దరు పంచాయితీ పెట్టారు.


**మేడారం పనుల పంచాయితీ**

రేవంత్ టీంలో ఈసారి కొండా సురేఖ తన సహచర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిపై ఫిర్యాదు

మిగతా 2లో

# జూబ్లీహిల్స్ ఉపఎన్నికపై బీజేపీ సైలెంట్ ప్లాన్.?

## బీజేపీ మద్దతిస్తున్నది ఎవరికీ.?



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉపఎన్నిక షెడ్యూల్ విడుదలైంది. నవంబర్ 11న పోలింగ్ జరుగుతుంది. దీంతో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ కసరత్తు మొదలు పెట్టాయి. బీఆర్ఎస్ అందరికన్నా ముందే అభ్యర్థిని ఖరారు చేసింది. సిట్టింగ్ స్థానం కావడంతో మాగంటి గోపీనాథ్ భార్యను అభ్యర్థిగా బరిలో దింపుతోంది. ఇక కాంగ్రెస్ కాస్త ఆలస్యంగా బీసీ అభ్యర్థిని రంగంలోకి దించింది. బీజేపీ మాత్రం ఇప్పటికీ అభ్యర్థిని ఖరారు చేయలేదు. బలమైన ఓటు బ్యాంక్ ఉన్నప్పటికీ, పోటీకి సరైన అభ్యర్థి ఎంపికలో, ప్రచారంలో చురుకుదనం చూపకపోవడం వెనుక అనుమానాలు పెరుగుతున్నాయి.

**గ్రౌండ్ వర్క్ లేకుండా ముందుకు..**

ఉపఎన్నికపై స్పష్టత ఉండడంతో ప్రధాన పక్షాలు ప్రచార రంగంలోకి దిగాయి. కానీ, బీజేపీ మాత్రం అభ్యర్థి ఖరారు చేయకుండా సైలెంట్‌గా ఉంది. నామినేషన్లు మొదలయ్యే సమయంలో కూడా ముమ్మర కసరత్తు చేయకపోవడం, ఆ పార్టీ మద్దతుదారులకు అసహనం కలిగిస్తోంది. ధర్మపురి అర్వింద్, కాంగ్రెస్‌కు చెందిన బొంతు రామ్మోహన్‌ను ఆహ్వానించే ప్రతిపాదన చేయడం, బీజేపీ తీరుపై మరిన్ని ప్రశ్నలను రేపుతోంది.

**బీఆర్ఎస్‌ను బలహీనపర్చేందుకే.?**

పార్టీ అంతర్గత చర్చల ప్రకారం, బీజేపీ వ్యూహం ప్రత్యక్ష పోరాటం కాకుండా ప్రత్యర్థిని బలహీనపరచడంపై కేంద్రీకృతమై ఉండవచ్చు. గత పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటు శాతం తగ్గి, బీజేపీ లాభపడింది. జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్ ఘోర పరాజయాన్ని ఎదుర్కుంటే, అసెంబ్లీ ఎన్నికలకు ముందే ఆ పార్టీపై ప్రతికూల ప్రభావం ఏర్పడుతుంది. బీజేపీ తక్కువ తీవ్రతతో పోటీ చేసి, బీఆర్ఎస్‌ను రాజకీయంగా కుదేలు చేయాలని చూస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన పోటీ జాతీయ పార్టీలు అయిన కాంగ్రెస్, బీజేపీ మధ్యే ఉంటుందని భావిస్తున్నట్లు తెలుస్తోంది.

**రహస్య ఒప్పందమా.?**

కాంగ్రెస్ మాత్రం ఈ వ్యవహారాన్ని భిన్నంగా చూస్తోంది. బీజేపీ, టీడీపీ కలిసి బీఆర్ఎస్‌కు మద్దతు ఇస్తున్నాయని, కాంగ్రెస్ వ్యతిరేక ప్రచారానికి ఉపఎన్నికను వేదికగా మలుస్తున్నారని అనుమానం వ్యక్తం చేస్తోంది. పోటీలో బీజేపీ సైలెంట్‌గా ఉండటం, కాంగ్రెస్‌కు నష్టంగా మారే గేమ్ ప్లాన్‌గా భావిస్తోంది. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో బీజేపీ నిశ్చితమైన పోరాటం చేపట్టకపోవడంతో పోటీ కాంగ్రెస్ బీఆర్ఎస్ మధ్యే ఉండే అవకాశం ఉంది. బీఆర్ఎస్ బలహీనపడటం లేదా కాంగ్రెస్‌పై వ్యతిరేక వాతావరణం పెరగడం. ఏది జరిగినా, ఈ వ్యూహం భవిష్యత్తు ఎన్నికల్లో ప్రధాన సమీకరణాలను ప్రభావితం చేసే అవకాశం ఉంది.



# వికసిత్ భారత్ వైపు అడుగులు వేయడంలో రైతులది ముఖ్యపాత్ర

### -ప్రపంచ దేశాలకు ఎగుమతికి

### వాణిజ్య పంటలను మన వద్ద పండించాలి

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) భారత్ ఇతర దేశాల దిగుమతులపై ఆధారపడకుండా ఉండాలంటే వరి, గోధుమ పంటలతోపాటు ప్రొటీన్ అధికంగా లభించే పప్పుల సాగును మరింత పెంచాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సూచించారు. ఆయన పీఎం ధన్ ధాన్య కృషి యోజన, మిషన్ ఫర్ ఆత్మనిర్భరత కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ, దేశం వికసిత్ భారత్ దిశగా అడుగులు వేయడంలో రైతులు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ప్రపంచ దేశాలకు ఎగుమతి చేసేలా వాణిజ్య

మిగతా 2లో



# నేను లెఫ్టిస్టు కాదు.. రైటిస్టు కాదు

### దేశభక్తి రావాలన్న పవన్ కళ్యాణ్


2లో




# అన్నపర్రు హాస్టల్ ఘటనపై సీఎం చంద్రబాబు ఆరా

### అధికారులకు కీలక ఆదేశాలు

2




2

# ఉద్యోగాలు ఇచ్చేవారుగా యువత ఉండాలి

### కోయంబత్తూరు ఎఫ్ఎంఏఈ కార్యక్రమంలో కేటీఆర్

# ముఖ్య ఎన్నికల అధికారికి బెదిరింపులు

### -మమతా బెనర్జీ క్లిప్పింగ్ కావాలన్న ఈసీ



2లో

# కల్తీ మద్యం నిరోధించేందుకు యాప్

### మెడికల్ కాలేజీలపై సీఎం సంచలన ప్రకటన



2లో

# ప్రధాని మోదీని కలిసిన రామ్ చరణ్, ఉపాసన

### కొత్తగా ప్రారంభించిన ఆర్చరీ లీగ్ విజయంపై చర్చ



2

PRAJA PRASHNA
ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక
ఆదివారం 12 అక్టోబర్2025

# వికసిత్ భారత్ వైపు అడుగులు వేయడంలో రైతులది ముఖ్యపాత్ర

పంటలను మన దేశంలో పండించాలని ఆయన పిలుపునిచ్చారు. దేశంలో పంటల ఉత్పత్తికి అయ్యే ఖర్చును తగ్గించి రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ హయాంలో పదేళ్ల కాలంలో వ్యవసాయ రంగానికి రూ. 5 లక్షల కోట్ల సబ్సిడీలు ఇస్తే, తమ ప్రభుత్వం పదేళ్ల కాలంలో రూ. 13 లక్షల కోట్లకు పైగా సబ్సిడీలు ఇచ్చిందని ఆయన తెలిపారు.

భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారాలంటే అన్ని రంగాల్లో నిరంతరం కొత్త మార్పులు చోటుచేసుకోవాలని మోదీ అన్నారు. ఈ ఆలోచనలో భాగంగానే ప్రధాన మంత్రి ధన్ ధాన్య కృషి యోజన పథకాన్ని తీసుకువచ్చామని వెల్లడించారు. గత ప్రభుత్వం దేశంలోని 100కు పైగా జిల్లాలను వెనుకబడినవిగా ప్రకటించి వదిలేసిందని, తాము అధికారంలోకి వచ్చాక ఆ జిల్లాలపై ప్రత్యేక దృష్టి సారించామని అన్నారు. ఆయా ప్రాంతాల్లో వ్యవసాయాన్ని అభివృద్ధి చేయడానికి తమ ప్రభుత్వం ప్రత్యేక ప్రాజెక్టులను అమలు చేస్తోందని తెలిపారు. వీటన్నింటినీ ప్రధాన మంత్రి ధన్ ధాన్య కృషి యోజన కిందకు తీసుకువస్తున్నట్లు పేర్కొన్నారు. వెనుకబడిన జిల్లాలలోని అనేక ప్రాంతాల్లో గత పాలకులు రోడ్లు వేయించలేదని, అలాంటి ప్రాంతాలను తమ ప్రభుత్వం డిజిటల్ ఇండియా దిశగా నడిపిస్తోందని అన్నారు. గత పదకొండేళ్లలో రైతులు పలు విజయాలు సాధించారని, పదివేలకు పైగా రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పడ్డాయని తెలిపారు.

# నేను లెఫ్టిస్టూ కాదు.. రైటిస్టూ కాదు

విజయవాడ (ప్రశ్న న్యూస్) 'స్త్రీ శక్తి అసమాన్యం. సూర్యుడిని సైతం మింగేయగలిగేంత అమోఘమైన శక్తి వారి సొంతం. భారతీయ సంస్కృతి, సంప్రదాయం, ధర్మం మహిళలకు అత్యున్నతమైన స్థానం ఇచ్చిందిని' ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. తనకు పుస్తకాలు చదవడం చిన్నప్పటి నుంచి అలవాటు అని, మొదటగా నాకు మా అమ్మ బుచ్చిబాబు రాసిన 'చివరకు మిగిలేది' అనే పుస్తకం ఇచ్చారని గుర్తుచేసుకున్నారు. ఆమె సూర్యుడిని కబళించింది అనే పుస్తకం రాసిన లక్ష్మీ ముర్డేశ్వర్ పురి అత్యున్నత పదవులు నిర్వహించి, మరో వైపు పుస్తకాలు రాయడం గొప్ప విషయం అని ప్రశంసించారు. లక్ష్మీ ముర్డేశ్వర్ పురి లాంటి ఎందరో ఉన్నతమైన నారీమణుల ఆలోచన మహిళా సాధికారతకు అద్దంపడుతుందన్నారు. విజయవాడలోని తుమ్మలపల్లివారి కళాక్షేత్రంలో జరిగిన 'ఆమె సూర్యుడిని కబళించింది' పుస్తక ఆవిష్కరణ కార్యక్రమంలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పాల్గొన్నారు. లక్ష్మీ ముర్డేశ్వర్ పురి రచించిన నవల తెలుగు అనువాద రూపం 'ఆమె సూర్యుడిని కబళించింది' పుస్తకాన్ని తెలుగులో సీనియర్ జర్నలిస్ట్ ఎ.కృష్ణారావు అనువదించారు.ఈ కార్యక్రమంలో పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "పుస్తకాలు చదవడం వల్ల మానసిక దృఢత్వం ఏర్పడుతుంది. విశాలమైన, విస్తృతమైన ఆలోచనల్ని పెంపొందిస్తుంది. మానసిక పరిపక్వత మనలో పెరగడానికి సామాజిక అంశాలపై మనదైన అవగాహన పెంచుకోవడానికి పుస్తకాలు చదవాలి. నేను విభిన్నమైన పుస్తకాలను చదువుతాను. ఇప్పుడు కారులో వస్తూ వనవాసి అనే పుస్తకాన్ని మరోసారి చదివాను. 1914, 1920ల కాలంలో కోల్‌కతాలోని పరిస్థితి సామాజిక అంశాలను వనవాసిలో చక్కగా వివరించారు. ఒక్కో పుస్తకంలో ఒక్కో రకమైన అంశం దాగి ఉంటుంది. మన మెదడు చురుకుగా పని చేయడానికి, కొత్తగా ఆలోచించడానికి పుస్తక పఠనం ఉపయోగపడుతుంది. లక్ష్మీ పురి రాసిన పుస్తకంలో స్త్రీని అత్యంత శక్తిమంతమైన మనిషిగా చూపడం ఆమె ఉన్నతికి నిదర్శనం.

**నేను లెఫ్టిస్టూ కాదు.. రైటిస్టూ కాదు**

'నన్ను చాలా మంది లెఫ్ట్ భావాలు వదిలేసిన వ్యక్తిగా పేర్కొంటారు. కానీ నేనెప్పుడూ లెఫ్టిస్టు కాదు, అలాగనీ రైటిస్టూ కాదు, నేను ఎప్పుడూ ఒకేలా ఉంటారు, ఒకేలా ఆలోచిస్తాను. వామపక్షవాదులు రాసిన పుస్తకాలు చదివాను, వారితో పరిచయాలు ఉన్నాయి. అలాగే జాతీయవాద భావాలు ఉన్న పుస్తకాలు సైతం చదువుతాను. భారతీయ సంస్కృతి, మన ధర్మం గురించి తెలుసుకుంటాను. దేశ భక్తి విషయంలో స్పష్టమైన అభిప్రాయం ఉంది. బయటకు వెళ్లినప్పుడు కూడా విభిన్న రకాల పుస్తకాలను వెతికి కొంటా. ఎందుకంటే ప్రతి పుస్తకం విలువైనదే. మనకు పుట్టుకతోనే దేశభక్తి రావాలని కోరుకునే వ్యక్తిని నేను' అన్నారు పవన్ కళ్యాణ్.

**భారత మహిళా శక్తికి ప్రతిరూపం ఈ పుస్తకం**

లక్ష్మీ పురి రాసిన ఆమె సూర్యుడిని కబళించింది పుస్తకం భారతీయ మహిళల శక్తిని చాటి చెబుతుంది. ఈ పుస్తకంలో మాలతి అనే పాత్రను వర్ణించడం, ఆ పాత్రను బలంగా ముందుకు తీసుకువెళ్లడంలో శ్రీమతి లక్ష్మీ పురి గారి రచనా శక్తి గొప్పగా అనిపిస్తుంది. చదివించేలా ఆమె రచనా శైలి ఉంటుంది. అందరిలో ఉత్సుకతను రేపేలా పుస్తకానికి పేరు పెట్టడం విశేషం. భారత వ్యవస్థ పూర్తిగా మాతృస్వామ్య వ్యవస్థ. స్త్రీని గౌరవించుకోవడంలో, ఆమెను పూజించడాన్ని భారతీయులు గొప్పగా భావిస్తారు. పుస్తకం విషయానికి వస్తే పీకా అనే యువకుడు మాలతి, కమలలను ఏడిపిస్తూ ఉండడం, దానికి బలంగా మాలతి స్పందించడంతో మొదలై.. ఆమె శక్తి మరింత పెంపొందేలా పుస్తక రచనను తీసుకువెళ్లారు. ఇది ప్రతి ఒక్కరు చదవాల్సిన పుస్తకం 'ఆమె సూర్యుడిని కబళించింది' అన్నారు.

**దుర్గాదేవి ఆరాధకుడిని**

అన్ని శక్తులకు మూలం దుర్గాదేవి అని, తాను దుర్గాదేవి ఆరాధకుడిని పవన్ కళ్యాణ్ తెలిపారు. మన దేశంలో స్త్రీకి ఎంతటి గౌరవం ఇస్తారంటే ప్రతి దేవుని పేరు ముందు అమ్మవారి పేరు ఉంటుంది. భాండాసురుడు అనే రాక్షసుడిని దేవతలెవరూ సంహరించలేని తరుణంలో శ్రీ లలితా త్రిపురసుందరీ దేవిగా శక్తి స్వరూపిణిగా అవతరించి ఆ రాక్షసుడిని అంతమొందించిందన్నారు. జనసేన పార్టీ మహిళా విభాగానికి పేరు పెట్టాల్సి వచ్చినప్పుడు పోరాట పటిమకు నిదర్శనంగా నిలిచే ఝాన్సీ లక్ష్మీ బాయి పేరు ఎంచుకున్నట్లు తెలిపారు. కేవలం రాజకీయల కోసమే కాకుండా, ప్రజల గురించి, పార్టీ గురించి పోరాడేందుకు ముందు వరుసలో మహిళలు ఉండాలనే స్ఫూర్తితోనే ఈ పేరు పెట్టానని గుర్తుచేసుకున్నారు. నాకు చిన్నప్పుడు ఏదైనా విషయంలో భయం వేసినప్పుడు అమ్మ చెప్పిన ధైర్యం ఎప్పటికీ గుర్తుంటుందని, సగటు భారతీయ సమాజంలో మహిళలు చెప్పే ధైర్యం ముందుకు నడిపించే ఆయుధంగా పని చేస్తుందన్నారు. చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు తీసుకువచ్చేందుకు ఎన్డీయే ప్రభుత్వం పనిచేస్తుందన్నారు.

# కొండా Vs పొంగులేటి.. టెండర్ వార్

చేశారని తెలుస్తోంది. తన శాఖలో ఆయన జోక్యం ఎక్కువైందని సీఎం దృష్టికి తీసుకొచ్చినట్టు సమాచారం. ఈ మధ్య మేడారం వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అక్కడి అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేస్తామని మాట ఇచ్చారు. ఆ పనులే ఇద్దరి మంత్రుల మధ్య చిచ్చు పెట్టినట్టు చెబుతున్నారు. మేడారం పనుల్లో ఏడు కోట్ల విలువైన టెండర్లకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశాలను ఇచ్చారను అంటున్నారు. తనకు తెలియకుండా తన మంత్రిత్వశాఖ పనుల్లో పొంగులేటి పెత్తనమేంటంటూ సురేఖ మండిపడ్డారని బోగట్టా.

**ఢిల్లీ వెళ్లేందుకు సిద్ధమైన కొండా సురేఖ**

పొంగులేటిపై రాష్ట్ర ముఖ్యమంత్రికి, రాష్ట్ర పార్టీ నాయకత్వానికి ఫిర్యాదు చేశారు. ఇక్కడ పరిష్కారం లభించలేదని భావిస్తున్న కొండా సురేఖ ఢిల్లీ వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. ఆదివారం ఢిల్లీ బయల్దేరి వెళ్తారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. సోమవారం అధినాయకత్వం అపాయింట్‌మెంట్ తీసుకొని పొంగులేటిపై ఫిర్యాదు చేస్తారని ఆమె సన్నిహితులు అంటున్న మాట.

**పెరుగుతున్న మంత్రుల పంచాయితీలు**

ఈ మధ్య కాలంలో మంత్రుల మధ్య పంచాయితీలు పెరిగిపోతున్నాయి. ప్రతిపక్షాల ఎత్తును గ్రహించి వాటికి అనుగుణంగా పైఎత్తులు వేయాల్సిన టైంలో ఇలా సొంత నేతల పంచాయితీలు ఏంటని ప్రభుత్వం, పార్టీ పెద్దలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మొదట్లో అసలు ముఖ్యమంత్రితోనే ఏ మంత్రికి పడటం లేదని ప్రచారం జరిగింది. దాన్ని ముఖ్యమంత్రితోపాటు మంత్రులంతా ఖండించారు. తర్వాత నల్గొండ మంత్రుల మధ్య పంచాయితీ నడిచింది. బహిరంగంగానే వారిద్దరు మోహాలు చిట్లించుకున్న సంగతి ప్రజలంతా చూశారు. అది కాస్త ముగిసిపోయిందని అనుకున్న టైంలో పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ మధ్య గొడవ రచ్చకెక్కింది. బహిరంగ వేదికపైనే ఇద్దరూ తిట్టుకున్నారు. మొత్తానికి పీసీసీ జోక్యం చేసుకొని పొన్నంతో సారీ చెప్పించి అడ్లూరిని కూల్ చేశారు. ఇలా ఆ వివాదాన్ని పరిష్కరించి ఇటు తిరిగే సరికి ఇక్కడ పొంగులేటి, కొండా సురేఖ మధ్య వార్ షురూ అయ్యింది. దీన్ని ఎలా పరిష్కరిస్తారో అన్న చర్చ పార్టీలో నడుస్తోంది. నిత్యం ప్రోటోకాల్ వివాదాలు, ప్రయార్టీ ఇవ్వడం లేదన్న మోహాలు మాడ్చుకున్న ఘటనలు రోజూ చూస్తూనే ఉన్నాం. వీటి సంగతి పీసీసీ చూసుకుంటోంది. కానీ అన్నింటినీ పరిష్కరించాల్సిన మంత్రులే ఇలా తగవులాడుకోవడం పార్టీని ప్రభుత్వాన్ని ఇరుకున పెడుతోందని కాంగ్రెస్ నేతలు అంటున్నారు. ఇలాంటిది ఎవరికి మంచిది కాదని అభిప్రాయపడుతున్నారు.

# తెలంగాణలో మరో సర్వే

స్వీకరిస్తుంది. దీనికోసం ప్రత్యేకమైన వెబ్ పోర్టల్ ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ సర్వే చివరి తేదీ ఈనెల 25 గా ఉంది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో ఇంటింటి సర్వేను చేపట్టిన విషయం తెలిసిందే. ఆ సర్వే కోసం రూ. 150 కోట్లు ఖర్చు పెట్టింది. ఆ గణాంకాలను వివిధ ప్రజా సంక్షేమ పథకాలు, రిజర్వేషన్లకు వినియోగించుకుంది రాష్ట్ర సర్కార్. అయితే తాజాగా మరో సర్వేను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించింది. 2047 లక్ష్యాలను నిర్దేశించుకుని మీ స్వరం- మీ దృష్టి- మన భవిష్యత్తు నినాదంతో తెలంగాణ రైజింగ్ విజన్- 2047 పేరుమీద సిటిజన్ సర్వేను శుక్రవారం ప్రారంభించింది. అక్టోబర్ 25వ తేదీ వరకు ఈ సర్వే కొనసాగుతుందని రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ సర్వేలో ప్రజలంతా పాల్గొనాలని, అభిప్రాయాలను, ఆలోచనలను పంచుకోవాలని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ పేర్కొన్నారు. ఈ సర్వే కోసం కేవలం 5-6 నిమిషాలు సమయం కేటాయిస్తే చాలని స్పష్టం చేశారు. ఈ సర్వేలో యువకులు, రైతులు, మహిళలు, విద్యార్థులు, విద్యావేత్తలు, వ్యాపారవేత్తలు, వృద్ధులు అన్ని వర్గాల వారు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్రధానంగా 8 అంశాలపై సూచనలు ఇవ్వాల్సి ఉంటుంది. తెలంగాణ రైజింగ్ విజన్ 2047 సర్వేలో భాగంగా మీ ప్రాంతానికి ప్రధానంగా ఏం కోరుకుంటున్నారో అందులో వివరంగా తెలపాలి. మీ జిల్లాకు, లేదా మండలానికి స్కూళ్లు, ఆస్పత్రులు, నగరాల్లో మాదిరిగానే ఉపాధి ఉద్యోగాలు, మహిళలకు భద్రత, గ్రామీణ ప్రాంతాల్లో అత్యాధునిక సేవలు తదితర అంశాలపై ప్రాధాన్యత క్రమంలో పేర్కొనాలని సర్వేలో వివరించారు.

# కల్తీ మద్యం నిరోధించేందుకు యాప్

అమరావతి (ప్రశ్న న్యూస్) కల్తీ మద్యం తయారీదారులు, వ్యాపారులపై రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ములకలచెరువు కల్తీ మద్యం తయారీదారులను అరెస్టు చేసినట్లు చెప్పారు. అయితే, కొందరు వ్యక్తులు రాజకీయ లబ్ధి కోసం కల్తీ మద్యం కేసు గురించి తప్పుడు కథనాలను ప్రచారం చేస్తున్నారని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. కల్తీ మద్యం తయారీని నిరోధించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఒక యాప్‌ను ప్రవేశపెట్టబోతోందని తెలిపారు. మద్యం బాటిళ్లపై ఉన్న హోలోగ్రామ్‌ను స్కాన్ చేయడం ద్వారా ఉత్పత్తి కల్తీదా లేక అసలుదా అని వినియోగదారులు తెలుసుకోవచ్చని చెప్పారు.

**జీఎస్టీ 2.0 సంస్కరణలు,కల్తీ మద్యంపై చర్యలు**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం పేదలు, మధ్యతరగతి ప్రజలకు లబ్ధి చేకూర్చేందుకు జీఎస్టీ 2.0 సంస్కరణలను ప్రవేశపెట్టిందని ముఖ్యమంత్రి చెప్పారు. జీఎస్టీ సంస్కరణల వల్ల నిత్యావసర వస్తువుల ధరలు తగ్గాయని, ఇది పేదలకు ఎంతో మేలు చేస్తుందని తెలిపారు. జీఎస్టీ సంస్కరణల ప్రయోజనాలను ప్రజలకు వివరించడానికి అక్టోబరు 16న ప్రధాని మోదీ కర్నూలు జిల్లాను సందర్శించనున్నారని ముఖ్యమంత్రి తెలియజేశారు.

**పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీలకు అభ్యంతరాలపై**

పీపీపీ విధానంలో కొత్త మెడికల్ కాలేజీల అభివృద్ధిపై అభ్యంతరాలు వ్యక్తం చేయడంపై ముఖ్యమంత్రి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. పీపీపీ విధానంలో ఏర్పాటు చేసే వైద్య కళాశాలల ద్వారా అదనంగా 110 మెడికల్ సీట్లు లభిస్తాయని ఆయన వివరించారు. ఈ విధానంలో కళాశాలలు రెండేళ్లలో అందుబాటులోకి వస్తాయని, అదే ప్రభుత్వం నేరుగా అభివృద్ధి చేపడితే ప్రాజెక్టు పూర్తి కావడానికి ఇరవై ఏళ్లు పడుతుందని ఆయన స్పష్టం చేశారు.

**స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్ ప్రారంభం**

అంతకుముందు సీఎం చంద్రబాబు నెల్లూరులోని మైపాడు గేట్ వద్ద ఏర్పాటు చేసిన స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్‌ను వర్చువల్‌గా ప్రారంభించారు.వీధి వ్యాపారులకు లబ్ధి చేకూర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం 30 మాడ్యులర్ కంటైనర్లలో 120 షాపులను ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ గత 18 ఏళ్లుగా వ్యాపారం చేస్తున్న వీధి వ్యాపారులు ఈ స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్ ఏర్పాటుతో ఇప్పుడు చిన్న పారిశ్రామికవేత్తలుగా (ఎంటర్‌ప్రెన్యూర్స్) మారారని తెలిపారు. షాపులను పారదర్శకంగా కేటాయించామని చెప్పిన చంద్రబాబు లబ్ధిదారులతో వర్చువల్‌గా మాట్లాడారు.

శాశ్వత దుకాణాలు దక్కడంపై వారు సంతోషం వ్యక్తం చేశారు. స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్ అనేది వీధి వ్యాపారులను చిన్న పారిశ్రామికవేత్తలుగా అభివృద్ధి చేయడానికి ఉద్దేశించిన వినూత్న ఆలోచన అని ముఖ్యమంత్రి అన్నారు. పేదల జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి కూటమి ప్రభుత్వం అనేక కార్యక్రమాలను ప్రారంభించిందని గుర్తుచేశారు. డ్వాక్రా గ్రూపుల నుంచి లక్ష మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నామని పేర్కొన్నారు. స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్ లబ్ధిదారులు, ముఖ్యంగా మహిళలు వర్చువల్‌గా ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. తమ జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు చేపడుతున్న ప్రయత్నాలకు ముఖ్యమంత్రి మద్దతు ఇస్తున్నారని వారు కొనియాడారు.

# బెంగాల్ లో మరో వైద్య విద్యార్థినిపై సామూహిక అత్యాచారం

ఆర్జీ కర్ వైద్య కళాశాల ఘటన మరువకముందే, పశ్చిమ బెంగాల్‌లోని పశ్చిమ బర్ధమాన్ జిల్లా దుర్గాపూర్‌లో మరో దారుణ ఘటన చోటుచేసుకుంది. ఓ ప్రైవేట్ మెడికల్ కాలేజీలో రెండో సంవత్సరం చదువుతున్న ఒడిశాకు చెందిన విద్యార్థిని సామూహిక అత్యాచారానికి గురైంది. ఈ అమానవీయ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఒడిశాలోని జలేశ్వర్‌కు చెందిన బాధితురాలు శుక్రవారం రాత్రి 8:30 గంటల సమయంలో తన క్లాస్‌మేట్‌తో కలిసి భోజనం కోసం కాలేజీ ప్రాంగణం నుంచి బయటకు వచ్చింది. ఆ సమయంలో కొందరు దుండగులు వారిని అడ్డగించి వేధించడం మొదలుపెట్టారు. భయంతో ఆమె స్నేహితుడు అక్కడి నుంచి పారిపోగా, ఒంటరిగా చిక్కిన యువతిని సమీపంలోని పొదల్లోకి లాక్కెళ్లి ఈ దారుణానికి పాల్పడ్డారని అసన్సోల్-దుర్గాపూర్ పోలీస్ కమిషనరేట్‌కు చెందిన ఓ సీనియర్ అధికారి తెలిపారు. అనంతరం నిందితులు ఆమె ఫోన్‌ను కూడా లాక్కుని పరారయ్యారు. ఈ ఘటనపై కాలేజీ యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రస్తుతం బాధితురాలు ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఈ ఘటనతో ఆమె కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. "ఇక్కడ మా కుమార్తె చదువును కొనసాగించబోము. ఈ ఘటనపై స్థానిక బీజేపీ నాయకత్వం తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. గతంలో సంచలనం సృష్టించిన ఆర్జీ కర్ జూనియర్ డాక్టర్ అత్యాచారం, హత్య కేసు తరహాలోనే ఈ కేసు వివరాలను కూడా కప్పిపుచ్చే ప్రయత్నం జరగకూడదని వారు డిమాండ్ చేశారు.

# అన్నపర్రు హాస్టల్ ఘటనపై సీఎం చంద్రబాబు ఆరా

అమరావతి (ప్రశ్న న్యూస్)గుంటూరు జిల్లా పెదనందిపాడు మండలం అన్నపర్రులోని బీసీ బాలుర హాస్టల్‌లో విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించారు. మంత్రి సవిత, ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి, విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం గుంటూరు జనరల్ ఆసుపత్రిలో (జీజీహెచ్) 24 మంది విద్యార్థులు చికిత్స పొందుతున్నారని అధికారులు సీఎంకు వివరించారు. వారిలో ఒక విద్యార్థికి ఇతర ఆరోగ్య సమస్యలు కూడా ఉండటంతో, మెరుగైన వైద్యం కోసం నిపుణుల సలహా మేరకు మంగళగిరి ఎయిమ్స్‌కు తరలించినట్లు తెలిపారు. మిగిలిన విద్యార్థుల ఆరోగ్యం నిలకడగా ఉందని మంత్రి సవిత ముఖ్యమంత్రికి తెలియజేశారు. పెదనందిపాడు వైద్య శిబిరంలో చికిత్స పొందిన వారిలో ఇద్దరు మినహా మిగిలిన వారందరినీ డిశ్చార్జ్ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

విద్యార్థులు పూర్తిగా కోలుకున్న తర్వాతే వారిని డిశ్చార్జ్ చేయాలని సీఎం చంద్రబాబు అధికారులను గట్టిగా ఆదేశించారు. హాస్టల్‌లో అందిస్తున్న ఆహారం నాణ్యత, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య కార్యక్రమాలపై ఆయన ఆరా తీశారు. అన్నపర్రు గ్రామంతో పాటు హాస్టల్ ప్రాంగణంలో ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపడుతున్నట్లు మంత్రి సవిత ఈ సందర్భంగా వివరించారు. కలుషిత ఆహారం వల్లే ఈ ఘటన జరిగి ఉండవచ్చని వైద్యులు ప్రాథమికంగా భావిస్తున్నట్లు అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. నిర్ధారణ కోసం నీరు, ఆహార నమూనాలను ల్యాబ్‌కు పంపించామని, ఆ నివేదికలు వచ్చిన వెంటనే వాటి ఆధారంగా కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ ఘటనపై విద్యార్థుల తల్లిదండ్రులు ఎలాంటి ఆందోళన చెందవద్దని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. ఆసుపత్రిలో ఉన్న చిన్నారుల ఆరోగ్యానికి ప్రభుత్వం పూర్తి బాధ్యత తీసుకుంటుందని, వారికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని తనకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని మంత్రి, అధికారులను ఆదేశించారు.

# ముఖ్య ఎన్నికల అధికారికి బెదిరింపులు

కోల్కతా (ప్రశ్న న్యూస్) పశ్చిమ బెంగాల్ ముఖ్య ఎన్నికల అధికారి మనోజ్ అగర్వాల్‌ను అవినీతి ఆరోపణల పేరిట ముఖ్యమంత్రి మమతా బెనర్జీ బెదిరించినట్లు వార్తలు రావడంతో ఈ వ్యవహారాన్ని కేంద్ర ఎన్నికల సంఘం తీవ్రంగా పరిగణించింది. ఈ నేపథ్యంలో ఆ వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోను అందజేయాలని ఈసీ కోరినట్లు జాతీయ మీడియాలో కథనం వెలువడింది. బెంగాల్ సీఈవో మనోజ్ అగర్వాల్ రాష్ట్రంలోని అధికారులను బెదిరిస్తున్నారని, తన పరిధిని దాటి వ్యవహరిస్తే ఆయనపై ఉన్న అవినీతి ఆరోపణలను బహిర్గతం చేస్తానని మమతా బెనర్జీ ఇటీవల ఒక సమావేశంలో వ్యాఖ్యానించినట్లు సమాచారం. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన వీడియో ఫుటేజీని, దాని అనువాద ప్రతిని అందజేయాలని సీఈవో కార్యాలయానికి ఈసీ సూచనలు జారీ చేసినట్లు తెలుస్తోంది. మమతా బెనర్జీ వ్యాఖ్యలను ఖండిస్తూ ప్రతిపక్ష నేత సువేందు అధికారి, బీజేపీ ఎమ్మెల్యేల బృందం ఎన్నికల సంఘానికి ఒక లేఖను సమర్పించింది. ఎన్నికల అధికారిని బెదిరించినందుకు ముఖ్యమంత్రిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు.

# ఉద్యోగాలు ఇచ్చేవారుగా యువత ఉండాలి

కోయంబత్తూరు (ప్రశ్న న్యూస్)బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, తెలంగాణ మాజీ మంత్రి కేటీఆర్ మరోసారి తెలంగాణ ఆవిష్కరణల ప్రస్థానాన్ని జాతీయ వేదికపై చాటిచెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు భారతదేశంలో తొలిసారిగా హైదరాబాద్‌లో విజయవంతంగా నిర్వహించిన ఫార్ములా-ఈ రేస్ నిర్వహణ గురించి ప్రస్తావించారు. తాము నిర్వహించిన ఫార్ములా ఈ రేసు కేవలం ఒక క్రీడా కార్యక్రమం కాదని, ఆవిష్కరణలు, క్లీన్ మొబిలిటీ, అత్యాధునిక సాంకేతికతకు తెలంగాణ కేంద్రంగా ప్రపంచ వేదికపై అడుగుపెట్టిందనడానికి ప్రతీక అని కేటీఆర్ స్పష్టం చేశారు. కోయంబత్తూరులో శనివారం జరిగిన 10వ ఎఫ్ఎంఎఈ నేషనల్ స్టూడెంట్ మోటార్‌స్పోర్ట్స్ పోటీలు 2025కి ముఖ్య అతిథిగా హాజరైన సందర్భంగా, దేశంలోని యువ ఇంజనీర్లు, ఆవిష్కర్తలను ఉద్దేశించి కేటీఆర్ ప్రసంగించారు.

**హైదరాబాద్ నగరంపై అంతర్జాతీయ దృష్టి**

కేటీఆర్ మాట్లాడుతూ.. 'ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన ఎలక్ట్రిక్ కార్లు హైదరాబాద్ వీధుల్లో పరుగులు తీసినప్పుడు, భవిష్యత్తు కోసం తెలంగాణ సిద్ధంగా ఉందని రుజువైంది. ఈ ఫార్ములా ఈ రేసు దాదాపు రూ. 700 కోట్ల ఆర్థిక కార్యకలాపాన్ని సృష్టించి, అంతర్జాతీయ దృష్టిని హైదరాబాద్ నగరం వైపు మళ్లించింది" అని పేర్కొన్నారు. ఈ ఫార్ములా-ఈ ఈవెంట్ ఒక ఆరంభం మాత్రమేనని, తెలంగాణ స్థిరమైన, సాంకేతికత ఆధారిత పారిశ్రామిక వృద్ధి లక్ష్యాన్ని కలిగి ఉందని, త్వరలోనే హైదరాబాద్ భారతదేశ మొబిలిటీ వ్యాలీ'గా ఆవిర్భవించబోతోందని ధీమా వ్యక్తం చేశారు. మోటార్‌స్పోర్ట్స్ అంటే కేవలం వేగం కాదుబీ అది తమ సామర్థ్యాలను పరీక్షించుకోవడం, హద్దులను ఛేదించడం, ఎంత దూరం వెళ్లగలమో తెలుసుకోవడం అని, జీవితంలో యువత కూడా రేసు కారు మాదిరి దూసుకుపోవాలని కేటీఆర్ అన్నారు. ఐటీ మంత్రిగా తన హయాంలో, ప్రపంచంలోనే అతిపెద్ద స్టార్టప్ ఇంక్యుబేటర్ అయిన టీ-హబ్, భారతదేశంలోనే అతిపెద్ద ప్రోటోటైపింగ్ కేంద్రమైన టీ-వర్క్స్ వంటి సంస్థల ద్వారా తెలంగాణ అంతర్జాతీయంగా ప్రశంసలు పొందిన ఆవిష్కరణల పర్యావరణ వ్యవస్థను ఎలా నిర్మించిందో కేటీఆర్ వివరించారు. "ఒక ఆలోచన టీ-హబ్ నుండి టీ-వర్క్స్‌కు వెళ్లడానికి ఒక టీ తాగేంత సమయం మాత్రమే పడుతుంది" అంటూ ఆలోచన అమలు వేగాన్ని చమత్కరించారు.

**యువత ఉద్యోగాలు సృష్టించాలి: కేటీఆర్ పిలుపు**

వందలాది మంది యువ ఇంజనీర్లకు సందేశమిస్తూ, అవకాశాల కోసం ఎదురుచూడకుండా, వాటిని మీరే సృష్టించుకోవాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. "మీరు సొంతంగా ఒక క్యూను సృష్టించగలిగినప్పుడు, ఇతరులు ఏర్పాటు చేసిన క్యూలో ఎందుకు నిలబడాలి?" అని ప్రశ్నించారు. "ఉద్యోగాలు వెతికేవారుగా కాకుండా, ఉద్యోగాలు ఇచ్చేవారుగా మారండి. మీరు పెద్ద కలలు కనడం ప్రారంభించిన తర్వాత, మీ సొంత సామర్థ్యాన్ని చూసి మీరే ఆశ్చర్యపోతారు" అని ఆయన ఉద్బోధించారు. తెలంగాణ రాష్ట్ర సాధన ప్రయాణాన్ని ఈ సందర్భంగా కేటీఆర్ గుర్తుచేశారు. ఒకప్పుడు రాష్ట్ర ఏర్పాటు సాధ్యం కాదని చాలామంది సందేహించారని, కానీ, "ఇప్పుడు 11 సంవత్సరాల తర్వాత, అనేక రంగాలలో దేశానికి ఆదర్శంగా నిలబడ్డాము. తెలంగాణ సాధించిన ప్రగతి విశ్వాసానికి పట్టుదలకు దర్శనీకత నిదర్శనం అన్నారు.

**జెన్ జీ కు కేటీఆర్ కీలక సందేశం**

నేటి యువతరం,ె న్ జీ కు ఒక ముఖ్యమైన సందేశాన్ని ఇస్తూ, కేటీఆర్ ఆదాయం కంటే ప్రభావానికి, అధికారం కంటే ప్రామాణికతకు ప్రాధాన్యత ఇవ్వాలని, వేగం, విస్తరణ పట్ల ఆకలిని కలిగి ఉండాలని సూచించారు. మీరు ఇతరులు అనుకున్నదాని కంటే తెలివైనవారు, బాధ్యత కలిగినవారు. భారతదేశాన్ని ముందుకు నడిపించేది మీరే" అని విద్యార్థులకు తెలిపారు. మోటార్‌స్పోర్ట్స్ అయినా, పాలన అయినా, జీవితంలో అయినా విజయం కేవలం యాదృచ్ఛికంగా రాదని, "మనం అవకాశాలను రూపొందించుకోవాలి, ధైర్యంతో అమలు చేయాలి. అప్పుడే భవిష్యత్తు ఉంటుందని" కేటీఆర్ స్పష్టం చేశారు.

# ప్రధాని మోదీని కలిసిన రామ్ చరణ్, ఉపాసన

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) టాలీవుడ్ అగ్రహీరో, గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, ఆయన అర్ధాంగి ఉపాసన కొణిదెల శనివారం ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. ఇటీవల తాను ప్రారంభించిన ఆర్చరీ (విలువిద్య) లీగ్ విజయవంతమైన నేపథ్యంలో ప్రధానిని మర్యాదపూర్వకంగా కలిసినట్లు రామ్ చరణ్ తన సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. ఈ భేటీకి సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం ఇంటర్నెట్‌లో వైరల్ అవుతున్నాయి. ఈ సమావేశంలో, భారతదేశంలో విలువిద్యకు పూర్వ వైభవం తీసుకువచ్చే లక్ష్యంతో ప్రారంభించిన ఆర్చరీ లీగ్ గురించి ప్రధాని మోదీకి వివరించినట్లు తెలుస్తోంది. దేశంలో ఈ క్రీడను మరింత ప్రాచుర్యంలోకి తీసుకురావడం, యువతను ప్రోత్సహించడం వంటి అంశాలపై వీరి మధ్య చర్చ జరిగినట్లు సమాచారం. ప్రధానితో చరణ్, ఉపాసన దంపతులు ఎంతో ఉత్సాహంగా మాట్లాడుతున్న దృశ్యాలు ఫొటోలలో కనిపించాయి. ఈ సందర్భంగా ప్రధాని మోదీ ధనుస్సు చేతబట్టారు. భారత్‌లో ఐపీఎల్, ప్రో కబడ్డీ లీగ్‌ల తరహాలోనే విలువిద్య కోసం ప్రత్యేకంగా 2025లో తొలిసారిగా ఆర్చరీ లీగ్‌ను ఢిల్లీలో నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో తెలంగాణ, తమిళనాడు, ఝార్ఖండ్, మహారాష్ట్ర, ఢిల్లీ, రాజస్థాన్ సహా మొత్తం ఆరు రాష్ట్రాల జట్లు పోటీపడ్డాయి. దేశీయ క్రీడలను ప్రోత్సహించేందుకు రామ్ చరణ్ ముందుకు రావడం, ఈ లీగ్‌కు విశేష ఆదరణ లభించడం గమనార్హం. ఈ లీగ్ విజయం గురించి ప్రధాని దృష్టికి తీసుకెళ్లడం ద్వారా ఈ క్రీడకు జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు లభిస్తుందని పలువురు భావిస్తున్నారు.

# తగ్గిన రాజకీయ వేడి..!!

## హైకోర్టు స్టేతో డీలా పడ్డ నాయకులు.

జూలూరుపాడు (ప్రశ్న న్యూస్) అక్టోబర్ 11:స్థానిక సంస్థలు ఎన్నికలు జరుగుతాయని మండలవ్యాప్తంగా అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు పల్లెలో ఎవరికి వారే పోటా పోటీగా నేను అంటే నేను ఎంపీటీసీ, జెడ్పీటీసీ గా పోటీ చేస్తున్నానని ప్రకటించుకుంటూ ప్రచారాలు చేసుకున్నారు. శుక్రవారం నామినేషన్లు వేసేందుకు అన్ని సిద్ధం చేసుకున్న సమయంలో హై కోర్టు ఊహించని రీతిలో స్టే విధించడంతో ఒక్కసారే రాజకీయ నాయకులు డీలా పడినారు. జూలూరుపాడు మండలంలో మొత్తం. 10 ఎంపీటీసీ, ఒక జెడ్పీటీసీ స్థానానికి అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీల నాయకుల మధ్య పోటా పోటీ పడనున్న. ఈ సమయంలో కోర్టు తీర్పుతో ఒక్కసారిగా ఇరు పార్టీల నాయకులు అయోమయంలో పడ్డారు. ఒకానొక ఒక దశలో గ్రామాల్లో అధికార పార్టీ నాయకులు జనరల్ ఎంపీటీసీ స్థానాల్లో వారికి వారే పోటీ పడుతూ గ్రూపులుగా విడిపోయి గ్రామాల్లో ప్రచారాలు కూడా మెదలుపెట్టినారు. ఏది ఏమైనా కోర్టు తీర్పుతో. బీసీ రిజర్వేషన్



మారి 2018 రిజర్వేషన్ వచ్చిన 42 శాతం రిజర్వేషన్ వచ్చిన గ్రామాల్లో పార్టీలు కండవులా మార్చేందుకు చోట మోటా లీడర్లు ఇప్పటి నుండే ప్రయత్నాలు మొదలుపెట్టి సామాన్య ఓటర్లను ఎవరికి వారు వెంట తిప్పుకుంటున్నారు. ఏది ఏమైనా రిజర్వేషన్ ప్రక్రియ పల్లెల్లో వున్న ప్రజా ప్రతినిధులుకు నిద్ర లేకుండా చేస్తుంది.

## భవిష్యత్తులో మరింత మెరుగ్గా భారత్-ఆఫ్ఘాన్ సంబంధాలు: ముత్తాఖీ

:




భారత్– అఫ్గానిస్థాన్ సంబంధాలు భవిష్యత్తులో మరింత మెరుగ్గా ఉంటాయని అఫ్గాన్ విదేశాంగ మంత్రి ఆమిర్ ఖాన్ ముత్తాఖీ ఆశాభావం వ్యక్తం చేశారు. భారత పర్యటనలో ఉన్న ముత్తాఖీ ఉత్తరప్రదేశ్‌లోని సహారన్‌పుర్‌లోని దారుల్ ఉలూమ్ దేవ్ బంద్‌ను శనివారం సందర్శించారు. అక్కడ ఆయనకు ఘనస్వాగతం లభించింది. ఈ క్రమంలో ప్రముఖ వార్తా సంస్థ ఏఎన్ఐతో ఇండియా–అఫ్గాన్ సంబంధాలు గురించి వ్యాఖ్యానించారు. ఇరుదేశాల సంబంధాల ఉజ్వల భవిష్యత్తును కలిగి ఉంటాయన్నారు.“ఉలేమా, ఆ ప్రాంత ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని నాకు ఆత్మీయ స్వాగతం పలికారు. వారికి నా కృతజ్ఞతలు. ఇప్పటి వరకు ప్రయాణం చాలా బాగుంది. దారుల్ ఉలూమ్ ప్రజలు మాత్రమే కాదు. ఆ ప్రాంత ప్రజలందరూ ఇక్కడికి వచ్చారు. నాకు ఆత్మీయ స్వాగతం పలికినవారందరికీ కృతజ్ఞుడిని. భారత్–అఫ్గాన్ సంబంధాలు భవిష్యత్తులో మరింత మెరుగ్గా ఉంటాయి” అని అఫ్గాన్ విదేశాంగ మంత్రి ఆమిర్ ఖాన్ ముత్తాఖీ వ్యాఖ్యానించారు.భారత పర్యటనలో ఉన్న ముత్తాఖీ శనివారం ఉదయం ఉత్తరప్రదేశ్‌లోని సహారన్‌పుర్‌కు చేరుకున్నారు. అక్కడ ఉన్న దారుల్ ఉలూమ్ దేవ్‌బంద్‌ను సందర్శించారు. శనివారం మధ్యాహ్నం 3 గంటలకు ఆయన ఒక బహిరంగ కార్యక్రమంలో ప్రసంగిస్తారని దారుల్ ఉలూమ్ దేవబంద్ ఇన్‌ఛార్జ్ తెలిపారు. అలాగే తాజ్‌మహల్‌ను సైతం సందర్శించనున్నారు. కాగా, దారుల్ ఉలూమ్ దేవబంద్ అనే ఇస్లామిక్ సెమినరీ భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా ఇస్లామిక్ పండితులను తయారు చేసింది. ఈ సెమినరీని 1800ల చివరలో సయ్యద్ ముహమ్మద్ అబిద్, ఫజ్లుర్ రెహమాన్ ఉస్మాయ్, మహతాబ్ అలీ దేవబంది సహా మరికొందరు స్థాపించారు.దాయాది దేశం పాకిస్థాన్‌తో ఘర్షణల వేళ అఫ్గానిస్తాన్ విదేశాంగ మంత్రి ముత్తాఖీ గురువారం భారత్ పర్యటనకు విచ్చేశారు. శుక్రవారం విదేశాంగ మంత్రి జైశంకర్‌తో భేటీ అయి పలు అంశాలపై చర్చించారు. ముత్తాఖీ పర్యటన భారత్, అఫ్గాన్ మధ్య బలోపేతం అవుతున్న దౌత్య సంబంధాలను ప్రతీకగా నిలుస్తోంది. ఆర్థిక, భద్రత, సాంస్కృతిక సహకారంపై దృష్టి సారించడం, భారత్ –అఫ్గాన్ మధ్య సంబంధాలను బలోపేతం చేయడమే లక్ష్యంగా ముత్తాఖీ ఇండియా పర్యటనకు వచ్చారు. భారత్ అఫ్గాన్ అభివృద్ధిలో గణనీయమైన పెట్టుబడిదారుగా ఉంది. ముత్తాఖీ పర్యటన ద్వారా ఇరుదేశాల మధ్య ఆర్థిక సంబంధాలు, వాణిజ్యం, పెట్టుబడులను పెంచే మార్గాలను అన్వేషిస్తున్నారు.

## రాహుల్ గాంధీ మాదిరిగానే తేజస్వీ యాదవ్ ఓడిపోతారు: ప్రశాంత్ కిషోర్




బిహార్ అసెంబ్లీ ఎన్నికల వేళ జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ కీలక ప్రకటన చేశారు. ఆరు సంవత్సరాల క్రితం అమేఠీలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ అవమానకరమైన ఓటమిని చవిచూసినట్లే, రాబోయే బిహార్ ఎన్నికల్లో ఆర్జేడీ నాయకుడు తేజస్వీ యాదవ్ ఓడిపోతారని జోస్యం చెప్పారు. ఆయన రఘోపుర్ అసెంబ్లీ స్థానాన్ని కోల్పోతారని పేర్కొన్నారు.రఘోపుర్ నుంచి దాదాపు 50 కి.మీ దూరంలో ఉన్న తన పార్టీ ప్రచారాన్ని ప్రారంభించే ముందు ప్రశాంత్ కిషోర్ పట్నాలో విలేకరులతో మాట్లాడుతూ పలు వ్యాఖ్యలు చేశారు. “ఒకే కుటుంబం ఆధిపత్యాన్ని అంతం చేయాలనుకునే నియోజకవర్గ ప్రజల నుంచి అభిప్రాయాన్ని పొందడానికి నేను రఘోపుర్‌కు వెళ్తున్నాను. తేజస్వీ యాదవ్‌కు ముందు, ఆయన తండ్రి లాలూ ప్రసాద్, రబ్రీ దేవి ఆ స్థానానికి ప్రాతినిధ్యం వహించారు. అయినప్పటికీ ఆ నియోజకవర్గం ప్రాథమిక సౌకర్యాల కోసం ఏడుస్తోంది” అని ప్రశాంత్ కిషోర్ ఆరోపించారు.జన్ సురాజ్ పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశం ఆదివారం జరుగుతుందని, రఘోపుర్ నుంచి తనకు వచ్చే అభిప్రాయం కూడా చర్చకు వస్తుందని ఆయన అన్నారు. దాని ఆధారంగా, అత్యంత అనుకూలమైన అభ్యర్థిని నిర్ణయిస్తారని, అది తానేనేనా అని చెప్పలేనని అన్నారు. ఆ నిర్ణయం పార్టీ తీసుకోవాలని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో తేజస్వీ యాదవ్ ఒకటి కంటే ఎక్కువ స్థానాల నుండి పోటీ చేయవచ్చని పుకార్లు వస్తున్నాయని విలేకరులు అడగ్గా, ప్రశాంత్ కిషోర్ నవ్వేశారు.అయితే జన సురాజ్ పార్టీ రఘోపుర్‌లో బలమైన అభ్యర్థిని నిలుపుతుందనే ఊహాగానాలు ఉండగా, తేజస్వీ యాదవ్ రెండు స్థానాల నుంచి పోటీ చేయనివ్వండని ప్రశాంత్ కిషోర్ అన్నారు. “రాఘోపుర్‌లో ఆయన భవితవ్యం 2019లో రాహుల్ గాంధీ భవితవ్యం లాగే ఉంటుందియ. ఆ సమయంలో కాంగ్రెస్ నాయకుడు రెండు స్థానాల్లో పోటీ చేసి, చివరికి తన బలమైన కోట అయిన అమేఠీని కోల్పోయారు. ఇప్పుడు తేజస్వీ కూడా అంతే” అంటూ వ్యాఖ్యానించారు.ప్రస్తుతం లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న గాంధీ 2019లో వయనాడ్ లోక్‌సభ స్థానాన్ని గెలుచుకున్నారు. గత సంవత్సరం లోక్‌సభ ఎన్నికల్లో ఆయన మళ్లీ రెండు స్థానాల నుంచి పోటీ చేశారు. వయనాడ్, రాయ్‌బరేలీ స్థానాల్లో బరిలో దిగారు. ఆ రెండు స్థానాలకు ఆయన తల్లి సోనియా గాంధీ అనేకసార్లు ప్రాతినిధ్యం వహించారు. రెండు స్థానాలను గెలుచుకున్న తర్వాత వయనాడ్ స్థానానికి రాజీనామా చేయగా, సోదరి ప్రియాంక వాద్రా సొంతం చేసుకున్నారు. ఆ తర్వాత అమేఠీని కూడా కాంగ్రెస్ సొంతం చేసుకుంది.అయితే భోజ్‌పురి సూపర్‌స్టార్ పవన్ సింగ్ అంశంపై మాట్లాడారు. పవన్ సింగ్ శత్రువు కాదు అని ఆయన బదులిచ్చారు. ఆయన వ్యక్తిగతంగా మిత్రుడే, బీజేపీలో ఉన్నారనేది తనకు పట్టింపు లేదని చెప్పారు. ఆయన భార్య తన అభద్రతా భావాలను పంచుకోవడానికి వచ్చినప్పుడు, తాను ఒక సోదరుడిలా హామీ ఇచ్చాని తెలిపారు. తాను లేదా జన్ సురాజ్ పార్టీ వారి వివాహ వివాదంలో జోక్యం చేసుకోబోమని చాలా స్పష్టంగా ఉన్నామని పేర్కొన్నారు.“ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి, మంత్రి అశోక్ చౌదరి వంటి కళంకిత నాయకులు జన్ సురాజ్ భయంతో జీవిస్తున్నట్లు కనిపిస్తోంది. అశోక్ చౌదరి నాపై తన పరువు నష్టం కేసును కొనసాగించబోనని, ప్రజల కోర్టులో దానిపై పోరాడతానని వాక్చాతుర్యంగా పేర్కొన్నారు. తాను ఏ అసెంబ్లీ స్థానంలో పోటీ చేయబోతున్నారో ముందు ప్రకటించనివ్వండి. అందుకు సిద్ధంగా ఉన్నాం” అని చెప్పారు.

# ప్రపంచానికి ఆరోగ్య ప్రాణభిక్ష: పరంపర వైద్యమే








### అనువంశిక వైద్యంతో ప్రతి వ్యాధికి చికిత్స

### మన జీవన విధానం మార్చుకుంటే వ్యాధులు మనకు దూరమే

### ఆహార నియమ నిబంధనలే మనకు శ్రీరామరక్ష

నేటి ఆధునిక ప్రపంచంలో ఆరోగ్యపరంగా అనేక సవాళ్లు ఎదురవుతున్నాయి. ఆధునిక విజ్ఞానం కొంతవరకు పురోగతి సాధించినప్పటికీ, ఆ చికిత్సలు తాత్కాలికంగా ఉండడం, దీర్ఘకాలంలో విపరీతమైన, భయంకరమైన దుష్ప్రభావాలు (సైడ్ ఎఫెక్ట్స్) చూపడం ప్రపంచానికి ఒక పెను ప్రమాదంగా పరిణమించింది. రానురాను కొత్త రకాల, నయంకాని భయానక వ్యాధులు విజృంభించడంతో, ప్రపంచం దృష్టి మన భారతీయ అనువంశిక సంప్రదాయ ఆయుర్వేద వైద్య విధానాలపై మళ్ళింది.
కరోనా (కోవిడ్–19) సమయంలో, ఇంత పెద్ద జనాభా ఉన్న మన ఉపఖండంలో లక్షలాది మంది మరణిస్తారని, ఆసియాలోని అతిపెద్ద, అత్యంత జనసాంద్రత కలిగిన ధారావి వంటి ప్రాంతాలు తుడిచిపెట్టుకుపోతాయేమోనని భయపడ్డారు. కానీ, మన సాంప్రదాయ ఆహార పద్ధతులు, మనం వాడే సుగంధ ద్రవ్యాలు, మన వంటింట్లో ఉండే ప్రతి వస్తువు పూర్తి ఔషధ గుణాలతో నిండి ఉండడం వల్ల, ఎంత పెద్ద రోగాన్నైనా మన శరీరం తట్టుకోగల వ్యవస్థను కలిగి ఉందనేది ప్రపంచానికి అర్థమైంది. ఈ కోణంలో, భారతీయ జీవన విధానాన్ని, సాంప్రదాయ విధానాన్ని, ప్రాచీన ఆయుర్వేద వైద్య రీతిలో ఉన్న వ్యాధినిరోధక శక్తిని (ఇమ్యూనిటీని) పెంచే వ్యవహార విధానాలను అనుకరించడం మొదలుపెట్టారు.

**ఆధునికతకు ఆయుర్వేద అనుసంధానం**

మనవాళ్ళు మన సాంప్రదాయ ఆహార రీతులు, జీవనశైలిని పక్కనపెట్టి పాశ్చాత్య విధానాలను అనుకరిస్తున్న సమయంలో, ప్రపంచం మొత్తం ఆయుర్వేద విధానాలను, పరంపర వైద్య రీతుల్ని భుజానికెత్తుకొని కీర్తిస్తోంది. దీనివల్ల మన పారంపర్య వైద్య జ్ఞానం విశ్వవ్యాప్తంగా గుర్తింపు దిశగా అడుగులు వేస్తోంది. వేల సంవత్సరాల క్రితమే మన ఋషులు మన జీవనశైలిని, ఆహార వ్యవహారాలను, ప్రకృతి పట్ల దృక్పథాన్ని ఎంత అద్భుతంగా, ముందుజాగ్రత్తగా రూపొందించారో! అందులో మనం కొంతైనా ఆచరిస్తే, వారి బాటలో నడవగలిగితే నిండు నూరేళ్లు హాయిగా బతకవచ్చు.కానీ, మనం మన విధానాలను పక్కనపెట్టి క్యాన్సర్, మధుమేహం (డయాబెటిస్), రక్తపోటు (బీపీ), గుండె జబ్బులు, ఊపిరితిత్తుల వ్యాధులు వంటి అనేక రకాల భయానక వ్యాధులను ఏరి కోరి కొని తెచ్చుకునే పద్ధతుల వైపు పరుగెత్తుతున్నాం. ఈ నేపథ్యంలో, మన సనాతన పరంపర ఆయుర్వేద మహత్తర జ్ఞానాన్ని ఆధునికంగా విశ్లేషించి, నేటి యువతకు, పౌరులకు అర్థమయ్యే రీతిలో ఆయుర్వేదాన్ని ఆధునిక వైద్య విజ్ఞానంతో మేళవించి, సరికొత్త ఆచరణాత్మక విధానాలను రూపొందించి ప్రపంచం ముందు ఉంచితే, వడ్డించిన విస్తరిలా ఆరోగ్యం ప్రతి ఒక్కరి సొంతమవుతుంది. అది మన భారతీయ ఆయుర్వేద వైద్యం గొప్పతనం అవుతుంది.

**జ్ఞాన భాండాగారాల వైపు పయనం**

మనం ఒకసారి తిరిగి మళ్ళీ ప్రకృతి వైపు, పరంపర వైపు, ప్రాచీన జీవన విధానం వైపు, ఆయుర్వేదం వైపు, మూలికా వైద్యం వైపు, మన వేద జ్ఞానం వైపు తప్పకుండా వెళ్ళాల్సిన సరైన సమయం ఆసన్నమైంది. పరంపర వైద్య విజ్ఞాన జ్యోతులు ఎన్నో ఉన్నప్పటికీ, విచక్షణతో, వివేకంతో, సాధ్యాసాధ్యాలను దృష్టిలో ఉంచుకొని, దుష్ప్రభావాలు లేని, శ్రేష్టమైన, విలువైన, అరుదైన వనమూలికలతో ఎన్నో అద్భుతమైన వ్యాధులకు చికిత్సలు చేసే విధానాలను శాస్త్రీయంగా ధ్రువీకరించుకోవాల్సిన అవసరం ఉంది. మన జ్ఞానం కూడా వారి దృష్టిలో నిజమే అని తెలియడం వల్ల మన ఉన్నతి మరింత పెరుగుతుంది.మన ప్రాచీన జ్ఞానంలో ఉన్న ఆధునిక సైన్స్ను వారికి అర్థమయ్యే రీతిలో చెప్పడం అంత కష్టమేమీ కాదు. మన ఋషులు చెప్పిన త్రిదోషాలు (వాత, పిత్త, కఫాలు), పంచభూతాలు, ఆహార విహారాలు, యోగ, ప్రాణాయామం, పంచకర్మలు వంటి విజ్ఞాన భాండాగారాలు మన సనాతన పరంపర భారతీయ వైద్య విధానంలో కోకొల్లలుగా ఉన్నాయి. అందులో ఇమిడి ఉన్న అనంతమైన జ్ఞానాన్ని ఆధునిక జ్ఞానంతో మేళవించి ప్రపంచానికి సరికొత్తగా చూపించాల్సిన అవసరం ఉంది.


**సంపూర్ణ నివారణకు ఆయుర్వేదం**

సోరియాసిస్, మధుమేహం, పక్షవాతం, క్యాన్సర్, బుద్ధిమాంద్యం, లివర్, కిడ్నీ, ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధులు, క్షయ వంటి అనేక వ్యాధులను సమూలంగా, పూర్తిగా నివారించే, నియంత్రించగలిగే వైద్య విధానాలు, వనమూలికలు, ఔషధాలు మన ఆయుర్వేద విజ్ఞానంలో సంపూర్ణంగా నిక్షిప్తమై ఉన్నాయి. అయితే, గ్రామీణ, పట్టణ, పల్లె, అటవీ ప్రాంతాల్లోని జానపద, గిరిజన, అనువంశిక, పారంపర్య వైద్యులు తమ దగ్గర ఉన్న అసలైన జ్ఞానాన్ని గ్రంథాలలో భద్రపరచుకుంటే, ముందు తరాలకు ఉపకరిస్తుంది. వారు చెప్పదలుచుకుంటే ప్రపంచానికి వారి గ్రంథాలను పరిచయం చేస్తే అవి అనుభవయోగ గ్రంథాలుగా ఉంటాయి.
ఏ ఔషధాన్ని ఎలా వాడాలి, వ్యాధిని ఎలా నిర్ధారించుకోవాలి, పేషెంట్‌కు ఎలాంటి డోస్ ఎప్పుడు, ఎంత ఇవ్వాలి, ఆహార వ్యవహారాలు ఏం చెప్పాలి, ఎన్ని రోజులకు తగ్గుతుంది వంటి ప్రాక్టికల్ అంశాలు ఇక్కడ ఉంటాయి. వీటిని నిక్షిప్తం చేసి ప్రపంచం ముందుకు తీసుకెళ్ళగలిగితే, మరింతగా మన ఆయుర్వేద వైద్యం ఏకంగా జాతీయ వైద్యంగా మాత్రమే కాక, ప్రపంచ వైద్యంగా ప్రకటించే స్థాయికి చేరుతుంది. తప్పకుండా ప్రపంచానికి ఇప్పుడు మరో మార్గం లేదు. ఇప్పటికే ఇతర ఔషధాలు పనిచేయకుండా వాటి రెసిస్టెన్స్ పెరిగింది. వారి దృష్టి మొత్తం కచ్చితంగా భారతీయ పరంపర వైద్య విజ్ఞానంలో నిగూఢంగా ఉన్న మన వైద్య విధాన రీతుల అధ్యయనంపై ఉంది. మనమే ప్రామాణికంగా వాటిని ఒక వ్యవస్థలో తయారుచేసి ప్రపంచానికి అందిస్తే, భారతీయ జ్ఞానం గొప్పదనం మరోసారి నిరూపించబడుతుంది.

**ఔషధ మొక్కల రక్షణ – జీవ వైవిధ్య పరిరక్షణ**

ఆయుర్వేద విజ్ఞానంలో అత్యంత కీలకమైనది ఔషధ మొక్కలు. ఇప్పటికే వేలాది అరుదైన ఔషధ మొక్కలు అంతరించిపోయాయి. ఉన్న మొక్కలను రక్షించాల్సిన బాధ్యత మనకుంది. ప్రతి ఇల్లు, ఆలయం, కళాశాల, ఆధ్యాత్మిక క్షేత్రంలో అరుదైన ఔషధ మొక్కలను మనం విధిగా నాటాలి, పెంచాలి, పంచాలి. జీవ వైవిధ్యాన్ని కాపాడే బాధ్యత కూడా మన పరంపర వైద్యులపై ఉంది.
ప్రభుత్వం, ప్రపంచం, ప్రతి ఒక్కరూ ఇక చూడాల్సింది, చేయాల్సింది ఆయుర్వేద జీవన విజ్ఞాన వికాసం వైపు, దాన్ని బ్రతికిస్తున్న పరంపర వైద్యుల వైపు. వారిని గుర్తించి, సరైన వసతులు కల్పించి, ఆర్థికంగా, సాంకేతికంగా, సైన్స్ పరంగా సహకారం అందించి, వారిలో ఉన్న విజ్ఞానాన్ని ప్రపంచానికి అందించి, వారికి ఆర్థిక ప్రగతికి దోహదపడితే, ప్రకృతికి మేలు, ప్రపంచానికి మేలు జరుగుతుంది.
ఆయుర్వేద జీవన విజ్ఞానం, మన భారతీయ వైద్యం ప్రపంచ చరిత్రలో తిరుగులేని మణిదీపంలా వెలుగుతూనే ఉంటుంది. చీకటితో నిండిన రోగాలను చిదిమేస్తూనే ఉంటుంది. ప్రపంచం రోగ రహిత మరో లోకంలో జీవించడానికి పరంపర ఆయుర్వేద జీవన విజ్ఞానమే ఇక ప్రపంచానికి ఆరోగ్య ప్రాణభిక్ష పెట్టే ఒక వజ్రదీపమని చెప్పక తప్పదు.శుభం

# శ్రీకాళహస్తిలో ఎర్రచందనం దుంగలను పట్టుకున్న అటవీశాఖాధికారి లోకేష్





శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్)శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ఏర్పేడు మండలం సదాశివకోనందు 11 లక్షల విలువచేసే ఎర్రచందనం దుంగలను పట్టుకున్న శ్రీ కాళహస్తి అటవీశాఖ అధికారులు.శ్రీకాళహస్తి అటవీశాఖాధికారి లోకేష్ మాట్లాడుతూ. శ్రీకాళహస్తి నియోజకవర్గం లోని ఏర్పేడు మండలం సదాశివ కొన నందు కొంతమంది ఎర్రచందనం స్మగ్లర్లు ఉన్నారని సమాచారం రావడంతో, తిరుపతి అటవీశాఖ అధికారులు తాము మరియు ట్రాన్స్ఫోర్ట్ సిబ్బంది సదాశివ కొనకు వెళ్లగా తమను చూసి స్మగ్లర్లు పారిపోయారని. ఆ ప్రాంతం నందు 435 కిలోల 11 లక్షల విలువచేసే ఎర్రచందనం 51దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు తెలియజేశారు, ఆ ప్రాంతం నందు మరికొన్ని చెట్లను నరికి వేసి ఉన్నారని వాటిని కూడా తీసుకువచ్చే కార్యాచరణ చేపడుతున్నామన్నారు.
శ్రీకాళహస్తి నియోజకవర్గం పరిసర ప్రాంతాల్లో ఉన్న అడవుల్లో ఎర్రచందనం సంపద అధికంగా ఉందని వాటిని సంరక్షించే దిశగా అధికారులతో కలిసి అక్కడ బెస్ క్యాంపు ఏర్పాటు చేసే విధంగా కార్యాచరణ చేపడుతున్నామన్నారు , ఇక శ్రీ కాళహస్తి నియోజకవర్గం లో తమిళనాడు నుంచి వస్తున్న స్మగ్లర్లకు లోకల్ గా ఉన్న వ్యక్తులు అటవీ ప్రాంతంలో ఎక్కడెక్కడ ఎర్రచందనం ఉన్నది సమాచారం అందిస్తున్నారని, వారి వివరాలు కూడా సేకరిస్తున్నామని త్వరలోనే వారిని పట్టుకునేందుకు కార్యాచరణ చేస్తున్నామని తెలియజేశారు.

PRAJA PRASHNA
ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267
తెలుగు దినపత్రిక
ఆదివారం 12 అక్టోబర్ 2025

# మధ్యాహ్న భోజన పథకం వర్కర్లకు నెలకు 10000 రూపాయలు ఇవ్వాలి..!!

### - ఖమ్మం జిల్లా రెండవ మహాసభలో సత్తెనపల్లి విజయలక్ష్మి డిమాండ్.






తల్లాడ, అక్టోబర్ 11 (ప్రశ్నన్యూస్): తెలంగాణ రాష్ట్రంలో మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న వర్కర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ ప్రకారం నెలకు పదివేల రూపాయలు చెల్లించాలని మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి)రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి సత్తెనపల్లి విజయలక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తల్లాడ మండల కేంద్రంలో జిఎన్ఆర్ ఫంక్షన్ హాల్ లో సంఘం నాయకురాలు మహదేవ లక్ష్మి, తాళ్లూరి లక్ష్మిల అధ్యక్ష వర్గంగా రెండవ మహాసభ జరిగింది. మహాసభలకు ప్రారంభ సూచకంగా జెండా ఆవిష్కరించి అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 54 వేలమంది మధ్యాహ్న భోజన పథకంలో వర్కర్లు పనిచేస్తున్నారన్నారు. 2023వ సంవత్సరములో ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ నాయకులు వారి పార్టీని అధికారంలోకి తీసుకువస్తే మధ్యాహ్న భోజన పథకం వర్కర్లకు నెలకు పదివేల రూపాయలు చెల్లిస్తామని హామీ ఇచ్చారని ఆమె ఈ సందర్భంగా గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్నా ఇంతవరకు ఆ హామీ ఊసు ఎత్తకపోవడం సమంజసం కాదన్నారు. అంగనవాడి ఉద్యోగులకు ఇస్తున్న మాదిరిగా మిడ్ డే మీల్స్ పథకానికి కూడా కోడిగుడ్లు తోపాటు నిత్యవసర వస్తువులు వస్తువులు అయినా కందిపప్పు, చింతపండు, నూనె ,గ్యాస్ ను ప్రభుత్వమే నేరుగా అందించాలని ఆమె ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. విద్యార్థులు తినే తిండి ఒకటే అయినప్పుడు ఎస్సీ ఎస్టీ బీసీ అంటూ తారతమ్యాలు చూపటం దురదృష్టకరమన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులకు చెల్లించే జీతాలతో పాటు, బిల్లులకు సంబంధించి స్టేట్ ట్రెజరీ నుంచి కాకుండా గ్రీన్ ఛానల్ ద్వారా నేరుగా కార్మికుల ఎకౌంటు లోకి పంపించాల్సిందేనన్నారు. ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి సింగు నరసింహారావు మాట్లాడుతూ ఒకొక విద్యార్థికి 5.50 పైసల నుండి 9 , మరియు 11 రూపాయల వరకు ఇస్తున్నారని బయట హొటలలో భోజనం చేస్తే 120 రూపాయలు ఉంటుందని ఐదు రూపాయల 50 పైసలతో ఒక పూట భోజనం ఏ విధంగా పెట్టాలో ప్రభుత్వ పెద్దలు ఆలోచన చేయాలన్నారు. ఒకవైపు పౌష్టిక ఆహార లోపాన్ని రూపుమాపటాన్ని ఈ పథకాన్ని చేపట్టారని చెబుతూ కేవలం పది రూపాయలతో పౌష్టికాహార లోపాన్ని ఏ విధంగా తీరుస్తారో అధికారులే వివరించాలన్నారు. ప్రతి విద్యార్థికి 25 రూపాయలు చెల్లించాలన్నారు. కోడిగుడ్డు ధర మార్కెట్లో ఏడు రూపాయలు ఉండగా కేవలం ఐదు రూపాయలు మాత్రమే చెల్లిస్తున్నారని తద్వారా ఒకొక కార్మికురాలు ప్రతి వారానికి రెండు నుండి నాలుగు వందల రూపాయలు నష్టపోవాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వమే నేరుగా కోడిగుడ్లను పంపిణీ చేయాలన్నారు. మధ్యాహ్న భోజన వర్కర్స్ సమస్యల పరిష్కారం కై ఏఐటీయూసీ ఆధ్వర్యంలో భవిష్యత్తులో కార్యచరణ రూపొందిస్తున్నట్లు ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు అధ్యక్షులు గాదల లక్ష్మీనారాయణ, కార్యనిర్వాక అధ్యక్షులు రావి శివరామకృష్ణ, ఉపాధ్యక్షులు గుండెపుంగు మల్లేష్ , వేము రాంబాబు, బి కే ఎం యు వర్కింగ్ ప్రెసిడెంట్ దండు ఆదినారాయణ, ఏఐవైఎఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ మద్దోజు. శ్రావణ్ , సిపిఐ తల్లాడ మండల కార్యదర్శి ఓర్సు రమేష్ , ఏఐటియుసి జిల్లా నాయకులు దయాకర్, తెలగారపు రామారావు, కర్నాటి బసవయ్య, రహమతుల్లా,%ంఎ% రహీం బీ ,తదితరులు పాల్గొన్నారు.

# స్వార్థ ప్రయోజనాల కోసమే వైద్యరంగం నిర్వీర్యం:వి.ఎస్.బోస్








### (తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఐదవ మహాసభ)

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ప్రభుత్వ ఆసుపత్రుల్లో పని చేస్తున్న కొంతమంది డాక్టర్లు, అధికారులే ప్రభుత్వ వైద్య రంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారని, ఎఐటియుసి జాతీయ నాయకులు వి.ఎస్.బోస్ విమర్శించారు. చాల మంది ప్రభుత్వ డాక్టర్లకు ప్రైవేట్ ఆసుపత్రుల్లో భాగస్వామ్యం ఉండడంతో తమ స్వార్థం కోసం ఈ వ్యవస్థను నీరు గార్చుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్ లోని ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయం సత్యనారాయణరెడ్డి భవన్లో తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ 5వ రాష్ట్ర మహాసభలు శనివారం ఘనంగ నిర్వహించారు. తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు సత్యనారాయణరెడ్డి అధ్యక్షతన జరిగిన మహాసభలను వి.ఎస్.బోస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు పేద ప్రజలకు నాణ్యమైన ఉచిత వైద్యం, విద్య అందాలంటే ఈ రెండు ప్రధాన రంగాలను ప్రభుత్వ ఆధీనంలోనే ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. వైద్యరంగంలో అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికులతో పని చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారికి కనీస వేతనాలను కూడ ఇవ్వకుండ తీవ్ర అన్యాయం చేస్తున్నాయని అన్నారు. వైద్యశాఖలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులందరికీ ప్రతి నెల 1వ తేదీన వేతనాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు, యూనియన్ గౌరవ అధ్యక్షులు ఎం.డి.యూసుఫ్ మాట్లాడుతు సమస్యల పరిష్కారానికి ఉద్యోగులు సమరశీల పోరాటాలకు సన్నద్ధం కావాలని పిలుపు నిచ్చారు. ప్రభుత్వ ఆధీనంలో ఉండాల్సిన విద్య, వైద్యం, సాగు, తాగునీరు, ప్రజా రవాణాలాంటి వాటిని కూడ పాలకులు పట్టించుకోక పోవడం దుర్మార్గమన్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినను కార్మికులకు పెద్దగా ఒరిగిందేమి లేదన్నారు. రాష్ట్రంలో 2 కోట్లకు పైగా అసంఘంటిత కార్మికులున్నారని, కనీసం వారిని పట్టించుకున్న దాఖాలు కూడ లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ఏళ్లు గడిస్తున్న ఇప్పటికీ కనీస వేతనాలను నిర్ధారించి అమలు చేయపోవడం తీవ్ర అన్యాయమని ఆయన పేర్కొన్నారు. ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బాలరాజ్ మాట్లాడుతు యూనియన్ ను మరింత బలోపేతం చేసేందుకు సభ్యులందరు కృషి చేయాలని సూచించారు. సంఘం ఎంత బలంగా ఉంటే సమస్యలు అంతా త్వరగా పరిష్కారం అవుతాయన్నారు. వైద్యశాఖలో పనిచేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎఐటియుసి పూర్తి సహాయ సహకారాలను అందించడం కోసం సన్నద్ధంగా ఉందని తెలిపారు. అంతకు మందు యూనియన్ అధ్యక్షులు సత్యనారాయణ రెడ్డి యూనియన్ జండా ఆవిష్కరించగా, యూనియన్ ప్రధాన కార్యదర్శి ఇందిరా శ్రీలక్ష్మి కార్యదర్శి నివేదిక ప్రవేశ పెట్టగా ప్రతినిధులు ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ మహా సభల్లో యూనియన్ కార్యనిర్వహక అధ్యక్షులు వి. వేణు కుమార్, ఉపాధ్యక్షులు ఎం.సి.ఎస్ రాజు, ఎం.ఎస్. మూర్తి, పిట్టల స్వాతి, యాదయ్య, కరుణాకర్, శివానందం, వెంకట్రావు డిప్యూటీ జనరల్ సెక్రటరీలు శ్రీనివాస చారి, నర్సయ్య, రాష్ట్ర కార్యదర్శి సరస్వతి, మధుసూదన్ రెడ్డి, అమృతరావు, జగన్ మోహన్ రావు, రామారావు, కిషన్, కోశాధికారి శాంత కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**రాష్ట్ర అధ్యక్షునిగా ఎంఎస్ మూర్తి ఏకగ్రీవ ఎన్నిక**

తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ 5 వ మహాసభల సందర్భంలో రాష్ట్ర నూతన అధ్యక్షునిగా ఎం.శ్రీనివాస్ మూర్తి నిఏకగ్రీవంగా ఏన్నుకున్నారు. ఉమ్మడి రాష్ట్రలో తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ రాష్ట్ర కార్యదర్శిగా ఉన్నత సేవలందించిన ఎం.ఎస్.మూర్తి ఆధ్వర్యంలో యూనియన్ మరింత బలమైన సంఘంగా నిలత్రోక్కుకొని ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రణాళిక బద్ధంగా పోరాటలతో సమస్యల పరిష్కారానికి ముందడుగు వేస్తుందని సభ్యులు ఆశాభావం వ్యక్తంచేసారు. తెలంగాణ మెడికల్ ఎంప్లాయాస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులుగా ఏన్నికైన ఎం ఎస్ మూర్తిని సభ్యులు అభినందించారు.

# "సర్వే నే సర్వరోగ నివారిణి":

### "పీటిల మాటున పేటీలు మారాయి.? వాస్తవం కాదు: ఎంజెఆర్
### నా జాగాలో నీ లోల్లీ ఏంది,అల్వాల్లో భూవివాదం: ఎంజెఆర్
### సర్వేకు సిద్ధమైతే గ్రౌండ్లో చూసుకుందాం,అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదు
### నాలుగు దశాబ్దాల క్రితం కొనుగోలు చేసిన భూమి,రెవెన్యూ రికార్డుల్లో వివరాలు చూసుకోవచ్చు
### సర్వే నెంబర్ 573 లో ఐదు ఎకరాల భూమిలో పది పీటిలు ఉన్నాయి.తర్వాత అధికారులు రద్దు చేసిన విషయం వాస్తవమే
### వీటిని బూచి గా చూపిస్తూ, అందరిపై ఆరోపణలు చేయడం సమంజసం కాదు



కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) మేడ్చల్ జిల్లా అల్వాల్ మండల్ పరిధిలో ఉన్న సర్వే నెంబర్ 573, 574 లో ఐదు ఎకరాల స్థల సరిహద్దు వివాదానికి సంబంధించి భూ యాజమాన్య హక్కు కలిగిన మామిడి జనార్దన్ రెడ్డి తనపై వస్తున్న అసత్య ఆరోపణలను ఖండించారు.నిన్న శనివారం సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో ఉన్న ఏడో వార్డులో జుపిటర్ కాలనీలో ఉన్న తన నివాసంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు.మామిడి జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో భూమి విలువలు భారీగా పెరిగిపోవడంతో, కొంతమంది వ్యక్తులు చిన్న పాటి తప్పులు ఆధారంగా చేసుకుని ఇతరులను మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్న సంఘటనలు కోకొల్లలుగా కనిపిస్తున్నాయని,ఈ నేపథ్యంలో ఆయన కూడా ఓ బాధితున్నీ అంటూ వివరించారు.ఈ క్రమంలో అల్వాల్ మండల్ పరిధిలో ఉన్న సర్వే నెంబర్ 573,574 లో 1986 లో ఐదు ఎకరాల భూమిని కొనుగోలు చేసినట్లు మామిడి జనార్ధన్ రెడ్డి పేర్కొన్నారు.ఆయన తెలిపిన వివరాల ప్రకారం సర్వే నెంబర్ 573లో 3 ఎకరాల:24 గుంటలు మోహన్ రెడ్డిది.2 ఎకరాల 24 గుంటలు మామిడి జనార్ధన్ రెడ్డి ది.ప్రైవేటు పాఠశాలకు చెందిన 5 ఎకరాల 32 గుంటలు.సర్వే నెంబర్ 573 లో మొత్తం భూమి:12 ఎకరాలు.574 పదెకరాల భూమి ఉన్నది వాస్తవమే!గుంట జాగలేదని పదే పదే అధికారులను తప్పు దోవ పట్టిస్తూ, మోహన్ రెడ్డి సమయం వృధా చేసుకుంటున్నాడు. అనవసరంగా నాపై గురి పెడుతూ,అసత్య ఆరోపణలు చేస్తున్నారు.అలాగే రెవెన్యూ రికార్డుల ఆధారంగా కాకుండా తప్పుడు పత్రాలను తెరమీదకి తీసుకువచ్చి పలు పత్రికలలో వచ్చిన కథనాల పట్ల ఆయన స్పష్టత ఇచ్చారు.ఈ సందర్భంగా మామిడి జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ 1986 నుండి ప్రస్తుత భూ యాజమాన్య హక్కులు తనకే ఉన్నాయంటూ రెవెన్యూ రికార్డుల ప్రకారం,గతంలో న్యాయస్థానాలు కూడా ఆర్డర్ తమకే అనుకూలంగా తీర్పును వెలువరించినట్లు వెల్లడించారు.సదరు ఆరోపణలు చేస్తున్న మోహన్ రెడ్డి వద్ద భూమికి సంబంధించిన రెవెన్యూ ధృవ పత్రాలు,ఆధారాలు ఉన్నప్పటికీ రెవెన్యూ అధికారులు సహాయ సహకారంతో సర్వే నెంబర్ 573 లో సర్వే పంచనామా చేయిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని అప్పుడే ఆయనకి న్యాయం జరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.కానీ ఇలాంటి అసత్య ఆరోపణలు చేయడం సమంజసం కాదని అన్నారు.గతంలో ఇదే భూమికి సంబంధించి రెవెన్యూ అధికారులు నిర్వహించిన సర్వే కి సంబంధించి పంచనామా నివేదికలు తమ దగ్గర ఉన్నాయని స్పష్టం చేశారు.అందులో ఆయనకు చెందిన భూమి ఇతరుల చేతుల్లోకి వెళ్లింది.అదిగాక మొట్టమొదటిగా ఆయన చేయాల్సిన పని సర్వే నెంబర్ 571,572,573 ని సర్వే చేయిస్తే కానీ వాస్తవాలు వెలుగులోకి రావన్నారు.నేనేదో పలు విభాగాల అధికారులతో కుమ్మక్కైనట్లు సదరు వ్యక్తి చేస్తున్న ఆరోపణలలో ఎలాంటి నిజం లేదని స్పష్టం చేశారు.గతంలో మున్సిపల్ నియమ నిబంధనలను ప్రకారం నాలా కన్వర్షన్ చేసుకొని తర్వాత ఇంటి పన్ను (పిటి నెంబర్లు) కోసం దరఖాస్తు చేసుకున్న విషయం వాస్తవమే, మున్సిపల్ అధికారులు పిటీ నెంబర్లు ఇచ్చిన విషయం నిజమే.తర్వాత వాటిపై ఫిర్యాదులు రావడంతో వాటిని రద్దు చేశారు.ఆరోపణలు చేస్తున్న వ్యక్తి వద్ద ఏదైనా ఆధారాలు ఉంటే న్యాయపరంగా ముందుకు రావాలని మామిడి జనార్ధన్ రెడ్డి సవాల్ విసిరారు.

## శ్రీకాళహస్తిలో లైసెన్సు లేకుండా ఉంటే కఠిన చర్యలు తప్పదు



శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్)అక్రమంగా టపాసులు కలిగి ఉన్న లేక రవాణా చేసిన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది లైసెన్స్ ఉన్న బాణసంచా షాపులను ఈరోజు శ్రీకాళహస్తి టూ టౌన్ సిఐ నాగార్జున రెడ్డి తనిఖీ చేయడం జరిగింది. లైసెన్సు లేకుండా అక్రమంగా బాణాసంచా నిలువ ఉంచిన, రవాణా చేసిన, అమ్మిన తగు కఠినమైన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేయడం జరుగుతుంది. ప్రజలందరూ దీపావళి సందర్భంగా తగు జాగ్రత్తలు ప్రజలు తీసుకోవాలని పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## తెలంగాణ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ నూతన కార్యవర్గం

హిమాయత్ నగర్ (ప్రశ్న న్యూస్) ఏఐటియూసి అనుబంధ సంస్థ అయిన తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ 5 వ మహసభల సందర్భంగా రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఒక ప్రకటనలో విడుదల చేసారు.

**నూతన కార్యవర్గం**

రాష్ట్ర గౌరవ అధ్యక్షులుగా యం.సత్యనారాయణ రెడ్డి, రాష్ట్ర అధ్యక్షులుగా ఎం.ఎస్ మూర్తి, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులుగా వేణుకుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పి.ఇందిరా శ్రీ లక్ష్మి, కోశాధికారిగా కే. సుశీల ఉపాధ్యక్షులుగా నర్సయ్య, ఆమృతరావు, స్వాతి, కవిత, డిప్యూటి ప్రధాన కార్యదర్శులుగా కా.కే.శ్రీనివాసాచారి, ఎస్.శివానందం, కార్యదర్శులుగా మధుసూదన్ రెడ్డి, బి. సరస్వతి, ఆర్.జగన్మోహన్ రావు, రామారావు, కిషన్ లు ఏకగ్రీవంగా ఎన్నుకోబడినట్లు ఒక ప్రకటనలో వెల్లడించారు

## రైల్వే ప్రయాణికులకు బ్యాడ్ న్యూస్- 300కి పైగా ట్రైన్స్ క్యాన్సిల్- ఎందుకో తెలుసా?

తీర్థయాత్రలకు, పర్యటక ప్రాంతాలకు వెళ్లాలనుకునేవారికి, సాధారణ రైలు ప్రయాణికులకి బ్యాడ్ న్యూస్. ఝాన్సీ డివిజన్తో సహా వివిధ ప్రదేశాలను సందర్శించడానికి అడ్వాన్స్డ్ కన్ఫర్మ్ రైలు టికెట్లను బుక్ చేసుకున్న ప్రయాణికులు తమ ప్రయాణ ప్రణాళికలను పునర్ సమీక్షించుకోవాల్సి ఉంటుంది. ఎందుకంటే వివిధ మెయిల్, ఎక్స్ప్రెస్, ప్యాసింజర్ రైళ్ల 300కి పైగా ట్రిప్పులు రద్దు అవ్వనున్నాయి. మరికొన్ని రైళ్లను దారిమళ్లించనున్నారు. భద్రతా అప్గ్రేడ్ పనులను ప్రారంభించడంతో రైల్వే శాఖ ఈ నిర్ణయం తీసుకుంది.300కి పైగా రైలు ట్రిప్పులు రద్దవ్వడంపై నార్త్ సెంట్రల్ రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ శశికాంత్ త్రిపాఠి స్పందించారు. సురక్షితమైన రైలు కార్యకలాపాల కోసం రైల్వే స్టేషన్లలో బ్యాలస్ట్ లేని ట్రాక్లను తిరిగి అభివృద్ధి చేస్తామని చెప్పారు. "సాంప్రదాయ ట్రాక్లలో, ట్రాక్ల కింద నీరు పేరుకుపోతుంది. ఈ నీరు కొంతకాలం తర్వాత బేస్ను బలహీనపరుస్తుంది. అయితే ట్రాక్ల కింద నీరు నిల్వ ఉండకుండా బ్యాలస్ట్లేని ట్రాక్లను డెవలప్ చేస్తాం. అలా చేయడం వల్ల వర్షం లేదా ఇతర కారణాల వల్ల ట్రాక్ పైకి వచ్చే నీరు డ్రైనేజీ ద్వారా బయటకు పోతుంది" అని త్రిపాఠి వెల్లడించారు.

ఈ ఏడాది నవంబర్ 25- జనవరి 8 వరకు బ్యాలస్ట్ లేని ట్రాక్ పనులు జరగనున్నాయి. అంతవరకు కొన్ని రైలు ట్రిప్పులు పాక్షికంగా రద్దవ్వనున్నాయి. మరికొన్నింటిని దారిమళ్లించనున్నారు. అయితే రైలు ట్రిప్పుల రద్దుపై దిల్లీకి చెందిన ప్రయాణికుడు మధుసూదన్ శర్మ కీలక వ్యాఖ్యలు చేశారు. రైలు ప్రయాణీకుల కోసం కొన్ని ఆధునిక అభివృద్ధి పనులు జరుగుతున్నాయని అన్నారు. అయితే రైల్వే ఒక ప్రధాన విభాగంలో అనేక రైలు ట్రిప్పులను రద్దు చేయడం, దారి మళ్లించడం తనకు కోపం తెప్పించిందన్నారు. విమాన ప్రయాణ ఖర్చులను భరించలేని దిగువ మధ్యతరగతి, పేద ప్రయాణికులు ఎటువంటి అసౌకర్యాన్ని ఎదుర్కోకుండా వారికి ఉపశమనం కలిగేలా అధికారులు సరైన ప్రణాళికను రూపొందించాలని కోరారు. మరోవైపు, సురక్షితమైన రైలు ప్రయాణం కోసం బ్యాలస్ట్ లేని ట్రాక్లను అభివృద్ధి చేస్తున్నాయనేది వాస్తవమైతే, అది మంచి చర్యేనని మరో ప్రయాణికుడు లోచన్ సింగ్ కొనియాడారు. ప్రయాణీకుల రద్దీ తక్కువగా ఉన్నప్పుడు అధికారులు ఇలాంటి పనులను చేసుకోవాలని సూచించారు.

రద్దైన రైళ్లు ఇవే వివరాలు!

రైలు నెంబరు (11901) వీరాంగన లక్ష్మీబాయి ఝాన్సీ – ఆగ్రా కాంట్కు రోజువారీ నడిచే రైలు నవంబర్ 26- జనవరి 9 వరకు రద్దైంది.

రైలు నెంబరు (11902) ఆగ్రా కాంట్- వీరంగన లక్ష్మీబాయి ఝాన్సీ (రోజువారీ) నవంబర్ 25- జనవరి 8 వరకు రద్దు

రైలు నెంబరు (11903) వీరంగన లక్ష్మీబాయి ఝాన్సీ – ఇటావా (రోజువారీ) నవంబర్ 25- జనవరి 8 వరకు రద్దు.

రైలు నెంబరు (11904) ఇటావా-వీరంగన లక్ష్మీబాయి ఝాన్సీ (రోజువారీ) నవంబర్ 26- జనవరి 9 వరకు రద్దు.

రైలు నెంబరు (64616) వీరాంగన లక్ష్మీబాయి ఝాన్సీ-లలిత్ పుర్ (రోజువారీ) నవంబర్ 25- జనవరి 8 వరకు రద్దు.

రైలు నెంబరు (64615) లలిత్ పుర్-వీరంగన లక్ష్మీబాయి ఝాన్సీ (రోజువారీ) నవంబర్ 25- జనవరి 8 వరకు రద్దు.

రైలు నెంబరు (64618) లలిత్ పుర్-బినా (రోజువారీ) నవంబర్ 25- జనవరి 8 వరకు రద్దు.

రైలు నెంబరు (64617) బినా-లలిత్ పుర్(రోజువారీ) నవంబర్ 25- జనవరి 8 వరకు రద్దు.


రైలు నెంబరు (07075) హైదరాబాద్-గోరఖ్ పుర్ (వీక్లీ ఒకసారి (శుక్రవారం)) నవంబర్ 28- జనవరి 2 వరకు రద్దు.

రైలు నెంబరు (07076) గోరఖ్ పుర్-హైదరాబాద్ (వీక్లీ ఒకసారి (ఆదివారం)) నవంబర్ 30- జనవరి 4 వరకు రద్దు. ఈ రైళ్లు సహా మరికొన్ని రద్దయ్యాయి.

పెరిగిన విమాన టికెట్ల ధరలు!

పండుగ సీజన్లో ప్రయాణీకుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ప్రయాగరాజ్- బెంగళూరు మధ్య విమాన సేవలను విస్తరించారు. ఇండిగో ఎయిర్లైన్స్ తన శీతాకాల షెడ్యూల్లో ఈ మార్గంలో విమానాల సంఖ్యను నాలుగు నుంచి ఆరుకు పెంచింది. ఈ సర్వీసులు ఆదివారం నుంచి శుక్రవారం వరకు ఉంటాయి. శనివారం విమానాలు ఉండవు. కొత్త షెడ్యూల్ అక్టోబర్ 26 నుంచి అమలులోకి రానుంది, మరోవైపు, దీపావళి పండగ నేపథ్యంలో విమాన టికెట్ ధరలు భారీగా పెరిగాయి.

# బీపీ ఉన్నట్టు ఎలా తెలుస్తుంది..?





ఆరోగ్యవంతులకు రక్తపోటు 120/80కి మించి ఉండరాదు. కానీ, నేడు మధ్య వయసు దాటిన చాలా మందిలో బీపీ ఈ లెవల్స్ కు పైనే ఉంటోంది. అది కొంత కాలానికి హైపర్ టెన్షన్ గా మారుతోంది. జీవన విధానం మారిపోయింది. ఉద్యోగం, ఇంట్లోనూ రకరకాల ఒత్తిళ్ల కారణంగా బీపీ నియంత్రణ దాటుతోంది. రక్తపోటు నియంత్రణలో ఉంచుకోకపోతే ధమనులను దెబ్బతీస్తుంది. శరీరంలోని కీలక అవయవాలపై ప్రభావం చూపెడుతుంది. అందుకే వైద్యుడి సూచనల మేరకు బీపీ నియంత్రణలో ఉంచుకోవడానికి మందులు వాడాల్సి ఉంటుంది. బీపీ ఎంతుంటుందో క్రమం తప్పకుండా పరీక్షించుకోవాల్సి ఉంటుంది.

**ఏందుకు ఈ రక్తపోటు...?**

గుండె నుంచి రక్తాన్ని ధమనులు శరీరంలోని అన్ని భాగాలకు తీసుకెళతాయి. గుండె రక్తాన్ని చాలా ఒత్తిడితో పంప్ చేస్తుంది. దాంతో అది వేగంగా ధమనుల ద్వారా ప్రయాణం చేస్తుంది. ఈ ఒత్తిడినే రక్తపోటు అంటారు. బ్లడ్ ప్రజర్ అందరిలోనూ ఉంటుంది. 120/80కు తక్కువగా ఉన్నంత వరకూ ఆరోగ్యానికి ఎలాంటి ఇబ్బందులు రావు. కానీ ఈ ఒత్తిడి పెరిగిపోతేనే ఎన్నో రకాల సమస్యలు మొదలవుతాయి. 120/80కు మించి 140/90 లోపు ఉంటే దాన్ని ప్రీ హైపర్ టెన్షన్ గా చెబుతారు. అదే 140/90 అంతకంటే ఎక్కువ ఉంటే స్టేజ్ 1 హైపర్ టెన్షన్ (అధిక రక్తపోటు) గా చెబుతారు. 160/100 కంటే ఎక్కువ ఉంటే స్టేజ్ 2 హైపర్ టెన్షన్ గా, అంతకంటే అధికంగా ఉంటే తీవ్ర సమస్యగా పరిగణించాలి. 60 ఏళ్లు దాటిన వారికి 150/90 ఉంటేనే హైపర్ టెన్షన్ ఉన్నట్టు అర్థం చేసుకోవాలి. అదే విధంగా ఈ రక్తపోటు 85/55 వరకు తగ్గినా ఇతరత్రా ఎలాంటి లక్షణాలు లేకుంటే కంగారు పడక్కర్లేదు. తక్కువగా ఉండి కళ్లు తిరుగుతున్నా, తల తిరుగుతున్నా, మూర్ఛిల్లుతున్నా, ఏకాగ్రత లేకపోయినా, కళ్లు బైర్లు కమ్ముతున్నా, వెంటనే వైద్యుడి వద్దకు వెళ్లాలి. హైపర్ టెన్షన్ ఉన్న సమయంలో తలపోటు, తల వెనుక మెడపై భాగంలో బాగా లాగినట్టు ఉండడం, చిరాకు, కోపం తదితర లక్షణాలు కొందరిలో కనిపించవచ్చు. కొంత మందిలో పైకి ఎలాంటి లక్షణాలు కనిపించవు.

**హైపర్ టెన్షన్ ఉంటే వైద్యుడి చెకప్ అవసరం**

హైపర్ టెన్షన్ ఉన్నవారు ఆలస్యం చేయకుండా వెంటనే డాక్టర్ ను సంప్రదించాలి. అప్పుడు మీ వైద్య చరిత్ర, ఏవైనా గుండె జబ్బులు ఉన్నాయా, పొగ తాగే అలవాటు ఉందా తదితర సమాచారం తెలుసుకునే ప్రయత్నం చేస్తారు. కొలెస్ట్రాల్, డయాబెటిస్ ఉందేమోనన్న అనుమానంతో రక్త పరీక్షలకు సిఫారసు చేస్తారు. దీనికితోడు వైద్యులు స్టెతస్కోప్ తో హృదయ స్పందనలను పరిశీలిస్తారు. వేగంగా కొట్టుకుంటుంటే ధమనుల పరిస్థితిని తెలుసుకునేందుకు ఈసీజీ, ఎకో, అల్ట్రాసౌండ్ పరీక్షలను సూచించవచ్చు. దీంతో ముందస్తుగా గుండె సంబంధిత సమస్యల బారిన పడకుండా జాగ్రత్తపడవచ్చు.



**ఇంట్లో బీపీ**

**మానిటర్ ఉంటే సేఫ్**

ప్రీ హైపర్ టెన్షన్ లేదా హైపర్ టెన్షన్ సమస్య ఉంటేనే బీపీ మానిటర్ అవసరం అన్న భావన ఉంటే దాన్ని చెరిపేయండి. ఇంట్లో బీపీ మానిటర్ ఉంటే రక్తపోటు నియంత్రణ తప్పకుండా ముందుగానే కట్టడి చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. 25 ఏళ్ల వయసు దాటిన వారందరూ నెలకోసారి అయినా బీపీ చూసుకోవడం ద్వారా అది నియంత్రణలో ఉన్నదీ, లేనిదీ తెలుస్తుంది. ప్రారంభంలోనే డాక్టర్ ను సంప్రదించి సూచనల మేరకు జీవన విధానాన్ని మార్చుకోవడం ద్వారా హైపర్ టెన్షన్ గా మారకుండా జాగ్రత్త పడవచ్చు. సిస్టోలిక్ ప్రజర్ 180 నుంచి 200 పాయింట్లు దాటితే వారి శరీర ధర్మాన్ని బట్టి పక్షవాతం బారిన పడే ప్రమాదానికి చేరువ అవుతున్నట్టు గుర్తించాలి. శరీరంలో తీవ్ర సమస్య ఉందని తెలుసుకోవాలి. హైపర్ టెన్షన్ ఉన్నవారు ఉదయం వేళ బీపీ మానిటర్ తో రోజుకు ఒక్కసారి అయినా చెక్ చేసుకోవడం ద్వారా ఈ ప్రమాదం నుంచి తప్పించుకోవచ్చు. స్ట్రోక్ కు గురయ్యే ప్రమాదం ఉన్నవారికి ఉదయం బీపీ ఎక్కువగా ఉంటుందట. వీలుంటే హైపర్ టెన్షన్ బాధితులు ఉదయం, సాయంత్రం కూడా పరీక్షించుకోవడం క్షేమదాయకం.

**బీపీ మానిటర్లలో రకాలు...**

డిజిటల్, మాన్యువల్ అని రెండు రకాల బీపీ పరీక్షా యంత్రాలు అందు బాటులో ఉన్నాయి. మాన్యువల్ అయితే అందులో పాదరసంతో కూడిన స్కేల్ కు ఓ ఎయిర్ బ్యాగ్ (కఫ్) ను పైపు ద్వారా అనుసంధానించి దాన్ని చేతి భుజం కింద కట్టుకోవాలి. 180 పాయింట్ల వరకు గాలి పంప్ చేసి నిదానంగా విడిచిపెట్టాలి. ఆ తర్వాత చేయి మడత భాగంలో కఫ్ కింద స్టేతస్కోప్ ను ఉంచడం ద్వారా బీపీ ఎంతుందో తెలుసుకోవచ్చు. అదే డిజిటల్ అయితే, ఇంత శ్రమ ఉండదు. చేతి పై భాగంలో కఫ్ కట్టేసి బటన్ నొక్కేస్తే చాలు. దానంతట అదే పౌచ్ లోకి గాలిని పంపిస్తుంది. వెంటనే బీపీ ఎంతుందో మానిటర్ లో అంకెల రూపంలో కనిపిస్తుంది. డిజిటల్ లో కూడా మూడు రకాలు ఉన్నాయి. అప్పర్ ఆర్మ్, రిస్ట్, ఫింగర్ బీపీ మానిటర్లు. అప్పర్ ఆర్మ్ అంటే భుజం కింద చేతికి పై భాగంలో కట్టుకునేది. రిస్ట్ కు కట్టుకుని పరీక్షించుకునే దానిని రిస్ట్ మానిటర్ గా పేర్కొంటారు. వేలుకి కట్టుకునే మానిటర్ ఫింగర్ మానిటర్.

**వైర్ లెస్**

వైర్ లెస్ గా పనిచేసేవి కూడా ఉన్నాయి. కఫ్ ను చేతికి కట్టుకోవాలి. బ్లూటూత్ ద్వారా యాండ్రాయిడ్ లేదా ఐఫోన్ లో బీపీ ఎంతుందో చూసుకోవచ్చు. క్వార్డియో, ఐ హెల్త్ తదితర బ్రాండ్లు ఈ రకం మానిటర్లను విక్రయిస్తున్నాయి. ఇందులో ఐ హెల్త్ మానిటర్ ధర ఫ్లిప్ కార్ట్ లో రూ.5వేలు.

సైలంట్ కిల్లర్. రక్తపోటు (బ్లడ్ ప్రజర్/బీపీ)కి మరోపేరు. బీపీని నియంత్రణలో ఉంచుకోకపోతే అది ఎన్నో సమస్యలకు కారణమవుతుంది. హార్ట్ ఎటాక్, పక్షవాతం, కిడ్నీ ఫెయిల్యూర్ బారిన పడే ప్రమాదం ఉంటుంది. మరి బీపీ నియంత్రణలో ఉందా? లేదా? అన్నది ఎలా తెలుస్తుంది...? బీపీ మానిటర్ ద్వారా క్రమం తప్పకుండా పరీక్షించుకుంటే సరి. అందుకోసం ఆస్పత్రి చుట్టూ తిరగడం కంటే ఓ మంచి బీపీ మానిటర్ ను ఇంట్లో ఉంచుకోవడం ఉపయోగకరం. మరి కొనే ముందు పరిశీలించాల్సిన విషయాలు ఉన్నాయి. అలాగే, బీపీ గురించి చాలా విషయాలు తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.

**ఫలితాల్లో కచ్చితత్వం**

వైద్యులు నాణ్యమైన, ప్రమాణాలతో కూడిన బీపీ మానిటర్లను ఉపయోగిస్తుంటారు. మరి ఇంట్లో పరీక్షించుకోవడానికి సౌకర్యంతో పాటు ఫలితాల కచ్చితత్వం కూడా అవసరం. డిజిటల్ లో రిస్ట్ మానిటర్లు కంటే హృదయానికి దగ్గరగా చేతికి కట్టే అప్పర్ ఆర్మ్ మానిటర్లలో ఫలితాల కచ్చితత్వం ఎక్కువ. అమెరికన్ హార్ట్ అసోసియేషన్ కూడా అప్పర్ ఆర్మ్ డిజిటల్ మానిటర్లను మాత్రమే సిఫారసు చేస్తోంది. రిస్ట్, వేలికి ధరించే బీపీ మానిటర్లలో ఫలితాల కచ్చితత్వం తక్కువ కనుక వాటిని సూచించలేదు. ఇక సంప్రదాయ బీపీ మానిటర్ లోనూ ఫలితాలు కచ్చితంగానే ఉంటాయి. డిజిటల్ బీపీ మానిటర్లలో బీపీ ఎక్కువగా ఉంటే రెడ్ కలర్, సాధారణంగా ఉంటే గ్రీన్ కలర్ లో ఫలితాలు కనిపించే సౌకర్యం ఉంది. హైపర్ టెన్షన్ రేంజ్ లో ఉంటే హెచ్చరించే మెషిన్లు కూడా ఉన్నాయి. గతంలో చూసుకున్న రీడింగ్స్ ను భద్రపరిచే సౌలభ్యం కూడా అన్నింటిలో ఉంటోంది. సుమారు 100 నుంచి 200 వరకు రీడింగ్స్ స్టోర్ అయి ఉంటాయి. వైద్యుడు దగ్గరకు వెళ్లినప్పుడు చూపించేందుకు ఈ డేటా ఉపయోగకరంగా ఉంటుంది.

**కఫ్ సైజు**


కఫ్ సైజు చేతికి సరిపోయే విధంగా ఉండాలి. అలాగే సరిగా ధరించాలి. అప్పుడే కచ్చితమైన రీడింగ్ వస్తుంది. పిల్లలకు, పెద్దలకు ఒకే సైజు కఫ్ సరిపోదు. అందుకే వాడే కఫ్ సరిపోకపోతే పెద్దల కోసం మరొకటి కొనుగోలు చేసుకుంటే సరి. కఫ్ లలో స్మాల్, మీడియం, లార్జ్ సైజులు ఉంటాయి. స్మాల్ అంటే 7.1నుంచి 8.7 అంగుళాల మేర కఫ్ పొడవు ఉంటుంది. మీడియంలో 8.8 నుంచి 12,8 అంగుళాలు, లార్జ్ లో 12.8 నుంచి 18 అంగుళాల మేర ఉంటుంది. ఎక్కువ శాతం బీపీ మానిటర్లు మీడియం సైజు కఫ్ తో విక్రయానికి వస్తుంటాయి.

**అడాప్టర్లు ఉన్నవి అయితే బెటర్**

డిజిటల్ మానిటర్లు బ్యాటరీల సాయంతో పనిచేస్తాయి. బ్యాటరీలతోపాటు అడాప్టర్లతో పనిచేసేవి కూడా ఉన్నాయి. అడాప్టర్ అయితే నేరుగా కరెంట్ ప్లగ్ పిన్ కు అనుసంధానించుకుని పరీక్షించుకోవచ్చు.

## బ్యాక్టీరియా 'ఆయుష్షు'!

మన ఆరోగ్యం విషయంలో పేగుల్లోని బ్యాక్టీరియా చాలా కీలక పాత్ర పోషిస్తుంది. సంక్లిష్ట పిండి పదార్థాలను జీర్ణం చేయటం దగ్గర్నుంచి రోగనిరోధకవ్యవస్థకు తర్ఫీదు ఇవ్వటం వరకూ ఎన్నెన్నో పనులు నిర్వర్తిస్తుంది. అంతేనా? ఇది ఆయుష్షు పెరగటానికీ తోడ్పడుతున్నట్టు తాజాగా బయటపడింది. వృద్ధుల ఆరోగ్యం మెరుగ్గా ఉండటానికీ పేగుల్లోని బ్యాక్టీరియాకూ గణనీయమైన సంబంధం కనబడుతుండటమే దీనికి నిదర్శనం. మంచి ఆరోగ్యంగా ఉన్న 90 ఏళ్ల వృద్ధుల్లో కూడా యువ ఆరోగ్యవంతుల పేగుల్లో మాదిరిగానే బ్యాక్టీరియా రకాలు కనబడుతున్నట్టు తేలింది మరి. వృద్ధుల ఆరోగ్యానికి బ్యాక్టీరియా దోహదం చేస్తోందా? ఆరోగ్యవంతుల పేగుల్లో మంచి బ్యాక్టీరియా ఉంటోందా? అనేది స్పష్టంగా తెలియనప్పటికీ.. ఈ రెండింటికీ లంకె ఉండటం మాత్రం నిజమని పరిశోధకులు పేర్కొంటున్నారు. అంటే రక్తనాళాల ఆరోగ్యానికి కొలెస్ట్రాల్ మాదిరిగానే వృద్ధుల ఆరోగ్యానికీ పేగుల బ్యాక్టీరియాను జీవసూచికగా భావించవచ్చన్నమాట. అందువల్ల పెరుగు, పులియబెట్టిన పదార్థాల వంటి ప్రొబయోటిక్స్ తీసుకోవటం మంచిది. ఇవి పేగుల్లో మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందటానికి తోడ్పడతాయి. ప్రొబయోటిక్స్ కొలెస్ట్రాల్‌ను నియంత్రిస్తాయి, కొన్నిరకాల క్యాన్సర్ల బారినపడకుండా చూస్తాయి. అందువల్ల ఇవి ఆరోగ్యంగా ఉండటానికి, ఆయుష్షు పెరగటానికి దోహదం చేసే అవకాశముందని నిపుణులు చెబుతున్నారు.



## ముందస్తు నెలసరికి పాల రక్ష!



కొందరికి కాస్త త్వరగా నెలసరి నిలిచిపోతుంటుంది (మెనోపాజ్). దీంతో ఎముకలు గుల్లబారటం, గుండెజబ్బుల వంటి సమస్యల ముప్పు మరింత పెరుగుతుంది. అయితే క్యాల్షియం, విటమిన్ డి ఎక్కువగా తీసుకోవటం ద్వారా ఇలా త్వరగా మెనోపాజ్ ముంచుకొచ్చే ముప్పును తగ్గించుకోవచ్చని అధ్యయనాలు సూచిస్తున్నాయి. గుర్తించాల్సిన విషయం ఏంటంటే- మాత్రల కన్నా క్యాల్షియం, విటమిన్ డి దండిగా గల ఆహారం తీసుకోవటం మూలంగానే ఈ ఫలితం కనబడుతుండటం. ముఖ్యంగా పాలు, పెరుగు వంటి పాల ఉత్పత్తులతో ఇంకాస్త ఎక్కువ ప్రయోజనం చేకూరటం. పాలు, పెరుగు, మజ్జిగ వంటి వాటితో లభించే విటమిన్లు, కొవ్వులు, హార్మోన్లు (ప్రొజెస్టిరాన్, ఈస్ట్రోజెన్ వంటివి) మాత్రల్లో ఉండకపోవటమే దీనికి కారణమని పరిశోధకులు భావిస్తున్నారు.

## గుడ్డెందుకు తినాలి?

**గుడ్డు పోషకాల నిలయం. ఇందులో మాంసకృత్తులు (ప్రోటీన్), అత్యవసరమైన 9 అమైనో ఆమ్లాలు, బి కాంప్లెక్స్ విటమిన్లు, డి విటమిన్, ఖనిజాలు దండిగా ఉంటాయి. గుడ్డు తింటే బరువు పెరుగుతుందని చాలామంది భావిస్తుంటారు. దీనికి కారణం పచ్చసొనలోని కొలెస్ట్రాలే.**



అయితే గుడ్డులో కొలెస్ట్రాల్ స్థాయులు ఎక్కువగా ఉన్నప్పటికీ.. దీంతో రక్తంలో కొలెస్ట్రాల్ మోతాదులు అంత ఎక్కువగా ఏమీ పెరగటం లేదని అధ్యయనాలు చెబుతున్నాయి. ఇందులో కేలరీలు తక్కువ. పైగా చాలాసేపటి వరకు కడుపు నిండిన భావన కలిగిస్తుంది. ఫలితంగా త్వరగా ఆకలి వేయదు. ఇలా ఇది పరోక్షంగా బరువు తగ్గటానికీ తోడ్పడుతుందన్నమాట.

కణాల పనితీరు, వాటి ఎదుగుదల, శక్తిని అందించటంతో పాటు శరీరంలో జరిగే పలు జీవక్రియలకు అవసరమైన పోషకాలు గుడ్డుతో లభిస్తాయి.

దీని పచ్చసొనలోని ఐరన్ మన శరీరం తేలికగా గ్రహించటానికి అనువుగానూ ఉంటుంది.

గుడ్డులోని ల్యూటీన్ అనే యాంటీ ఆక్సిడెంటు కంటి జబ్బుల ముప్పు తగ్గటానికి తోడ్పడుతుంది. వృద్ధాప్యంలో మెదడు ఆరోగ్యంగా ఉండటానికీ ఇది దోహదం చేస్తుంది.

రోజుకు ఒక గుడ్డు తినేవారిలో పక్షవాతం ముప్పు 12 శాతం వరకు తగ్గుతున్నట్టు ఒక పరిశోధనలో వెల్లడైంది.

## పొటాషియం తగ్గితే..



ఖనిజ లవణాల్లో ఒకటైన పొటాషియం మనకు ఎంతగానో తోడ్పడుతుంది. నాడులను, కండరాలను నియంత్రించటం దగ్గర్నుంచి.. ఆహారం జీర్ణం కావటం వరకూ ఎన్నో పనుల్లో పాలు పంచుకుంటుంది. అందుకే పొటాషియం లోపిస్తే కండరాలు పట్టేయటం, గుండె కొట్టుకునే వేగం మారిపోవటం, చర్మం పొడిబారటం, మొటిమలు, అజీర్ణం వంటి సమస్యలెన్నో ముంచుకొస్తాయి. పొట్టుతీయని ధాన్యాలు, మాంసం, చిక్కుళ్లు, పండ్లు, కూరగాయల్లో పొటాషియం దండిగా ఉంటుంది. ముఖ్యంగా అరటిపండు, చిలగడదుంపలతో పుష్కలంగా లభిస్తుంది. అందుకే పండ్లు, కూరగాయలు అంతగా తినకుండా చిప్స్ వంటి చిరుతిళ్లు ఎక్కువగా తినేవారిలో దీని లోపం ఎక్కువగా చూస్తుంటాం.

PRAJA PRASHNA
ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక
ఆదివారం 12 అక్టోబర్ 2025

# పొట్టి స్కర్ట్‌లో లైగర్ బ్యూటీ



బాలీవుడ్ స్టార్ చుంకీ పాండే వారసురాలు అనన్య పాండే ఇండస్ట్రీలో అడుగు పెట్టి వరుస సినిమాలతో అలరించే ప్రయత్నం చేస్తోంది. స్టార్ కిడ్ అవ్వడంతో ఈ అమ్మడికి ఈజీగానే ఇండస్ట్రీ ఎంట్రీ లభించింది. అయితే ఆశించిన స్థాయిలో సక్సెస్ లు దక్కక పోవడంతో ఈ అమ్మడు కాస్త స్లో గా సినిమాలు చేయాల్సిన పరిస్థితి. 2019 సంవత్సరంలో స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్ సినిమా తో బాలీవుడ్ లో అడుగు పెట్టింది. ఆ వెంటనే కరోనా కారణంగా సినిమాలు ఎక్కువ రాలేదు. ఇక తెలుగు లో ఈమె లైగర్ సినిమా తో ఆకట్టుకునే ప్రయత్నం చేసింది. లైగర్ సినిమా భారీ విజయాన్ని సొంతం చేసుకుంటే పాన్ ఇండియా హీరోయిన్ గా మంచి గుర్తింపు దక్కించుకునేది. కానీ లైగర్ ఫలితం తారు మారు అయింది. ట్రెండింగ్: పవన్ కళ్యాణ్ నటవారసుడి డెబ్యూపై బిగ్ లీక్ హీరోయిన్ గా ఇప్పుడిప్పుడే స్టార్ డమ్ దక్కించుకుంటున్న అనన్య పాండే తన హాట్ ఫోటో షూట్స్ తో ఎప్పుడో స్టార్ హీరోయిన్ గా మారి పోయింది అనడంలో సందేహం లేదు. హీరోయిన్ గా మరింత బిజీ అయ్యేందుకు ఈమె హాట్ ఫోటోలు ఉపయోగపడే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. తాజాగా పొట్టి స్కర్ట్ లో అందాల ఆరబోత ఫోటోలు షేర్ చేసి అందరి దృష్టిని ఆకర్షించింది. ఆకట్టుకునే ఈ అమ్మడి ఫిజిక్ కు తోడు రొమాంటిక్ గా ఉండే స్కిన్ షో తో ఈ అమ్మడు రెగ్యులర్ గా ఆకట్టుకుంటూ ఉంది. ఈ ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. థైస్ అందాలను చూపిస్తూ ఈ అమ్మడు చేసిన స్కిన్ షో ఆకట్టుకుంది.

# క్లీవేజ్ కవ్వింపులు.. రాశి మెరుపులు




ఊహలు గుసగుసలాడే సినిమా తో అలరించిన ముద్దుగుమ్మ రాశి ఖన్నా తన అందం సినిమా సినిమా కు పెంచుకుంటూనే వస్తుంది. టాలీవుడ్ ప్రేక్షకులకు బొద్దు గుమ్మల కంటే ముద్దుగుమ్మలు నప్పుతారని తెలిసి కష్టపడి బరువు తగ్గింది. అంతే కాకుండా చాలా వరకు విభిన్నమైన పాత్ర లు ఎంపిక చేసుకుంటూ సినిమాలు చేస్తూ ఇండస్ట్రీలో ఇన్నాళ్లు కొనసాగిన విషయం తెల్సిందే. హీరోయిన్‌గా రాశి ఖన్నా తెలుగు మరియు తమిళంలో ఇన్ని సినిమాలు చేయడానికి కారణం ఆమె అందం అనడంలో సందేహం లేదు. సోషల్ మీడియాలో ఆమె అందాల ఆరబోత ఫోటోలు షేర్ చేయడం ద్వారా చాలా మంది ఫిల్మ్ మేకర్స్ ఇంకా హీరోలు కూడా ఆమెను తమ సినిమాల్లో నటింపజేసేందుకు ఆసక్తి చూపించారు అంటూ ఇండస్ట్రీ వర్గాల టాక్. ట్రెండింగ్: పవన్ కళ్యాణ్ నటవారసుడి డెబ్యూపై బిగ్ లీక్ తాజాగా గ్లోబల్ స్పా మ్యాగజైన్ కవర్ పై రాశి ఖన్నా సర్ ప్రైజ్ లుక్స్ తో ఆకట్టుకుంది. కవ్వించే క్లీ వేజ్ షో చేయడం తో పాటు విభిన్నమైన ఔట్ ఫిట్‌లో కనిపించింది. హీరోయిన్‌గా రాశి ఖన్నాకు ఇంకా చాలా మంచి ఫ్యూచర్ ఉందని ఈ ఫోటోలు చూస్తూ ఉంటే అనిపిస్తుందని కొందరు నెటిజన్స్ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఈ అమ్మడు చేస్తున్న సినిమాలు పెద్దగా ఏమీ లేవు. కానీ రెండు మూడు పెద్ద సినిమాల చర్చలు జరుగుతున్నట్లుగా ఆమె సన్నిహితులు చెబుతున్నారు. ఈ రేంజ్ అందాల ఆరబోత చేస్తూ ఉంటే ముందు ముందు మరి కొన్నాళ్ల పాటు కూడా ఇండస్ట్రీలో ఈ అమ్మడి జోరు కొనసాగే అవకాశాలు ఉన్నాయి.

# జాన్వీ స్థానాన్ని ఆమె రీప్లేస్ చేస్తుందా?



జాన్వీ స్థానాన్ని ఆమె రీప్లేస్ చేస్తుందా? ఏది ఎవరికి రాసి పెట్టి ఉంటే వారికే దక్కుతుందని పెద్దలు ఊరికే అనలేదు. సినీ ఇండస్ట్రీలో ఒకరు చేయాల్సింది మరొకరు చేయడం చాలానే జరిగాయి. ఏది ఎవరికి రాసి పెట్టి ఉంటే వారికే దక్కుతుందని పెద్దలు ఊరికే అనలేదు. సినీ ఇండస్ట్రీలో ఒకరు చేయాల్సింది మరొకరు చేయడం చాలానే జరిగాయి. అలాంటి సిట్యుయేషన్ ఇప్పుడు మరోసారి వచ్చింది. జాన్వీ కపూర్, కార్తీక్ ఆర్యన్, లక్ష ప్రధాన పాత్రల్లో దోస్తానా2 అనే సినిమాను ధర్మ ప్రొడక్షన్స్ కొన్నేళ్ల కిందట అనౌన్స్ చేసింది. కొంత భాగం షూటింగ్ అయ్యాక అనివార్య కారణాలతో మరియు కోవిడ్ వల్ల ఆ సినిమా ఆగిపోయింది. – రూమర్డ్ గర్ల్ ఫ్రెండ్ తో హార్దిక్.. ఆమె ఎవరు? బ్యాక్ గ్రౌండ్ ఏంటో తెలుసా? స్క్రిప్ట్ లో మార్పులతో పాటూ క్యాస్టింగ్ లో కూడా.. అప్పట్నుంచి దోస్తానా2లో ఎన్నో మార్పులు జరుగుతూ రాగా, ఇప్పుడు తిరిగి ఆ సినిమా ట్రాక్ లోకి వచ్చినట్టు తెలుస్తోంది. మొదట్లో ఎన్నో ఆర్భాటాలతో మొదలైన దోస్తానా2 స్క్రిప్ట్ ను రీ రైట్ చేస్తున్నారని, స్క్రిప్ట్ లో మార్పులతో పాటూ మూవీ మెయిన్ క్యాస్టింగ్ లో కూడా మార్పులు చేస్తున్నట్టు మేకర్స్ ఈ ఏడాది మొదట్లో వెల్లడించారు. కార్తీక్ ఆర్యన్, నిర్మాణ సంస్థ మధ్య విబేధాలు గుణశేఖర్ కి ఎన్టీఆర్ బాకీ..కానీ తీర్చడం కష్టమే! దోస్తానా2 మెయిన్ క్యాస్టింగ్ ను మార్చి, మళ్లీ కొత్త క్యాస్టింగ్ తో రాబోతున్నట్టు నిర్మాణ సంస్థ ప్రకటించగా, కార్తీక్ ఆర్యన్ మరియు నిర్మాణ సంస్థ మధ్య విబేధాలు తలెత్తాయి, అందుకే ఆయన్ను సినిమా నుంచి తప్పించారని వార్తలొచ్చాయి. అయితే అప్పటికే జాన్వీ కపూర్ 30– 35 రోజులు దోస్తానా2 కోసం వర్క్ చేసినప్పటికీ, రీక్యాస్టింగ్ అన్న తర్వాత ఆమె కూడా ఆ సినిమా నుంచి తప్పుకున్నారు. జాన్వీ ప్లేస్ లో ప్రతిభా రంతా %ూశ్రీంశీ =ఖుం% – బిజినెస్ మ్యాన్ తో పెళ్లి.. త్రిష ఘాటు రిప్లై వైరల్.. అయితే దోస్తానా2 కోసం మేకర్స్ కొత్త క్యాస్టింగ్ ను వెతుకుతున్న నేపథ్యంలో జాన్వీ కపూర్ ప్లేస్ లో లాపాటా లేడీస్ లో నటించిన ప్రతిభా రంతాను ఫైనల్ చేశారని తెలుస్తోంది. లక్ష్య ఈ ప్రాజెక్టులో కొనసాగుతున్నప్పటికీ కార్తీక్ ఆర్యన్, జాన్వీ కపూర్ మాత్రం దోస్తానా2 నుంచి తప్పుకున్నారు. కార్తీక్ ఆర్యన్ స్థానంలో విక్రాంత్ మాస్సేను తీసుకోగా, జాన్వీ ప్లేస్ లో ప్రతిభా రంతాను తీసుకున్నారని తెలుస్తోంది. %ూశ్రీంశీ =ఖుం% – ఆమ్‌స్టర్ డామ్‌లో అందమైన ప్రేమ జంట లేట్ అయిన లక్ష్య లాంచ్ ముందుగా ఈ పాత్ర కోసం శ్రీలీల పేరుని పరిశీలించినప్పటికీ ఆఖరికి ప్రతిభా రంతాను సెలెక్ట్ చేశారని తెలుస్తోంది. లాపాటా లేడీస్ లో తన యాక్టింగ్ తో అందరినీ ఆకట్టుకున్న ప్రతిభా రంతా దోస్తానా2 సినిమాకు కొత్త ఉత్సాహాన్ని తెస్తోందని అందరూ భావిస్తున్నారు. నేషనల్ అవార్డ్ విన్నర్ విక్రాంత్ మాస్సే ఈ సినిమాలో తాను నటిస్తున్న విషయాన్ని రీసెంట్ గానే కన్ఫర్మ్ చేశారు. ఫెయిల్, ఎ డెత్ ఇన్ ది గంజ్, హసీన్ దిల్‌రూబా సినిమాల్లో తన నటనకు విమర్శకుల ప్రశంసలు అందుకున్న విక్రాంత్ మాస్సే, దోస్తానా2 కు స్పెషల్ ఎట్రాక్షన్ గా నిలవనున్నారు. ఇదిలా ఉంటే 2019లోనే ధర్మ ప్రొడక్షన్ లో లక్ష్య లాంచ్ కావాల్సింది. కానీ దోస్తానా2 సినిమా ఆగిపోవడంతో అది జరగలేదు. ఇప్పుడు దోస్తానా2 తిరిగి మొదలవుతున్న సందర్భంగా ఎంతో కాలంగా వెయిట్ చేస్తున్న లక్ష్య లాంచ్ కూడా జరిగే అవకాశముంది.

# మజిలి భామ మరో అదిరిపోయే ఛాన్స్..!



మజిలీ సినిమాతో తెలుగు తెరకు ఎంట్రీ ఇచ్చిన భామ దివ్యాన్ష కౌశిక్. శివ నిర్వాణ డైరెక్షన్ లో నాగ చైతన్య, సమంత కలిసి నటించిన ఆ సినిమాలో దివ్యాన్ష ఉన్న కొంత టైం అయినా తన మార్క్ నటనతో ఆకట్టుకుంది. అయితే మజిలీ తర్వాత ఆమెకు వరుస అవకాశాలు వస్తాయని భావించగా ఎందుకో ఆశించిన స్థాయిలో రాలేదు. 3 ఏళ్ల తర్వాత రవితేజ హీరోగా వచ్చిన రామారావు ఆన్ డ్యూటీ సినిమాలో ఛాన్స్ కొట్టేసింది దివ్యాన్ష. ఆ సినిమా ఫెయిల్ అవడంతో అమ్మడికి ఇక అవకాశాలు కష్టమే అనుకున్నారు. కానీ సందీప్ కిషన్ మైఖెల్ సినిమాలో ఆమె మళ్లీ లక్కీ ఛాన్స్ కొట్టేసింది. మిల్కీ బ్యూటీతో భోళా కెమిస్ట్రీ.. మాములుగా లేదు పాన్ ఇండియా లెవెల్ లో రిలీజైన మైఖెల్ కూడా నిరాశ పరిచింది. అదే కాదు సిద్ధార్థ్ హీరోగా చేసిన టక్కర్ కూడా రీసెంట్ గా వచ్చి డిజాస్టర్ అయ్యింది. ఇన్ని ఫ్లాపులు పడ్డా అసలైతే ఏ హీరోయిన్ కి మరో ఛాన్స్ రావడం కష్టం. కానీ దివ్యాన్ష కౌశిక్ రిజల్ట్ తో సంబంధం లేకుండా సినిమా అవకాశాలు అందుకుంటుంది. దివ్యాన్ష కౌశిక్ లేటెస్ట్ గ రౌడీ హీరో విజయ్ దేవరకొండ సినిమాలో లక్కీ ఆఫర్ కొట్టేసిందని తెలుస్తుంది. విజయ్ దేవరకొండ పరశురామ్ కాంబినేషన్ లో వస్తున్న సినిమాలో దివ్యాన్ష సెకండ్ హీరోయిన్ గా నటించబోతుందని తెలుస్తుంది. తమన్నా తెలుగింట కోడలే! ఆల్రెడీ ఈ సినిమాలో మృణాల్ ఠాకూర్ హీరోయిన్ గా నటిస్తుంది. ఆమెతో పాటుగా దివ్యాన్ష కౌశిక్ కి ఈ సినిమాలో అవకాశం లభించినట్టు తెలుస్తుంది. రౌడీ హీరో సినిమాలో ఛాన్స్ అంటే దివ్యాన్ష కౌశిక్ గ్రాఫ్ పెరిగే అవకాశం ఉంది. యాక్టింగ్ లో సోసోగానే అనిపించినా గ్లామర్ తో అయినా తెలుగు ఆడియన్స్ ని తన బుట్టలో వేసుకోవాలని చూస్తున్న దివ్యాన్ష వచ్చిన ఏ చిన్న అవకాశాన్ని వదిలి పెట్టట్లేదు. ఈ క్రమంలోనే అమ్మడికి వరుస అవకాశాలు కూడా తలుపు తడుతున్నాయి. టక్కర్ సినిమా తర్వాత దివ్యాన్షని మర్చిపోవడమే అనుకున్నారు కానీ ఏకంగా విజయ్ దేవరకొండ ఆఫర్ తో సర్ ప్రైజ్ చేస్తుంది దివ్యాన్ష. గీత గోవిందం కాంబో సినిమా కాబట్టి ఈ సినిమాపై అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి. మరి ఈ సినిమా రిజల్ట్ ఏ రేంజ్ లో ఉండబోతుందో చూడాలి. దిల్ రాజు బ్యానర్ లో నిర్మిస్తున్న ఈ సినిమాను కూడా పాన్ ఇండియా రిలీజ్ ప్లాన్ చేస్తున్నారని తెలుస్తుంది.

PRAJA PRASHNA
ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267
తెలుగు దినపత్రిక
ఆదివారం 12 అక్టోబర్2025

# పొగాకు పంటలో ఎరువుల యాజమాన్యం..!

ఆరు నుండి ఎనిమిది వారాల వయసుగల నారును పొలములో నాతవలెను. ఆగష్టు, సెప్టెంబరు మాసము బీడీ పొగాకు, సెప్టెంబరు, అక్టోబరు మాసములు నాటు పొగాకు నాట్లు వేయుటకు అనువైనవి. బీడీ పొగాకు మొక్కలకు 75ఐ75 సెం.మీ దూరము, నాటు పొగాకుకు 70ఐ70 సెం.మీ దూరము ఇవ్వవలెను.అరోగ్యవంతమైన నారు మొక్కలు పొగాకు పంట అధిక దిగుబడికి, నాణ్యతకు ప్రధమ సోపానము. కేంద్ర పొగాకు పరిశోధనా సంస్థ గత 6 దశాబ్దాలుగా ఆరోగ్యవంతమైన నారు మడులను పెంచడానికి, నాణ్యత గల పొగాకును పండించడానికి కృషి చేస్తూ, మేలైన యాజమాన్య పద్ధతులను కనుగొని, వ్యవసాయంలో ఖర్చుతగ్గించడానికి అనువైన సాంకేతిక పరిజ్ఞానాన్ని రూపొందించింది.

ప్రధాన పొలంలో మొక్కల స్థానాన్ని నిలువుగా, అడ్డంగా నడిపి గుర్తిస్తారు. పరస్పరం ఖండించుకునే బిందువుల వద్ద నారు మొక్కలు జాగ్రత్తగా నాటుతారు. నాటి సమయంలో తగినంత తేమ ఉండేట్లు చూస్తే వారు మొక్కలు స్థిరపడతాయి. వానలు లేకపోతే నాటి స్థలాలకు నారు మొక్కలు నాటే ముందు కుండతో నీరు పోస్తారు.

**ఎరువుల యాజమాన్యం:**

ఒక హెక్టారు బీడీ పొగాకుకు 110 కిలోల నత్రజని, 70 కిలోల పాస్ఫరసు 50 కిలోల పొటాష్ నిచ్చు ఎరువులను, నాటు పొగాకుకు 40 కిలోల నత్రజని, 50 కిలోల పాస్ఫరము, 50 కిలోల భాస్వరాన్నిచ్చే రసాయనక ఎరువులు వాడాలి. నత్రజని ఎరువును రెండు సమభాగాలుగా చేసి నాటడానికి ముందు, నాటిన 25-30 రోజుల లోపల వేసుకోవాలి. భాస్వరము, పొటాష్ ఎరువులను ఒక మోతాదులో వేయాలి. పొటాష్ ఎరువును సల్ఫేట్ ఆఫ్ పొటాష్ రూపంలో ఇవ్వాలి. ఎరువులను మొక్కలను నాటుటకు ఒక వారము రోజులు ముందుగా మొక్కలు నాటు దాళ్ళలో, నాగటి చాళ్ళు తీసి వేయాలి.

సేద్యం మూడు పళ్ళ గొర్రుతో గాని, గుంటకతో గాని చేయవలెను. నేలలో వున్న తేమను బట్టి పైరు పెరుగుదలను బట్టి చేనులో వున్న కలుపును బట్టి ఎడసేద్యము చేసుకొనవలెను.మొగ్గ ప్రారంభమయ్యే దశలో బీడి పొగాకులో 14 నుండి 16 ఆకులు, నాటు పొగాకులో 16 నుండి 18 ఆకులు వుంచి కొమ్మ త్రుంచవలెన్. కొమ్మ తుంచిన నాలుగైదు రోజులలో పిలకలు వచ్చుట ఆరంభమగును. అందువలన ప్రతి ఐదు, ఆరు రోజులకు ఒకసారి చేతితోగాని లేక రసాయనిక మందులతో గాని పిలకలను తీసివేయవలెను. పెండిమిథాలిన్ 1.5% లేదా డెకెనాల్ 7% లేదా రాయల్టన్ 4% లేదా నీమ్ ఆయిల్ ఎమల్షన్ 35% వాడి పిలకలు రాకుండా నివారించుకోవచ్చును. నత్రజని అమ్మోనియం ఫాస్ఫేట్ రూపములోను భాస్వరమును, సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, డై అమ్మోనియం ఫాస్ఫేటు రూపములోను మరియు పొటాషియంను సల్ఫేటు ఆఫ్ పొటాష్ రూపములో వేయాలి. నికోటియానా టబాకమ్ వంగడాలను దేశీ రకాలు అంటారు. వాటికి పొడవైన మొక్కలు, పొడవైన, వెడల్పైన ఆకులు. సాధారణంగా పింక్ పువ్వులు ఉంటాయి.టబాకమ్లో ప్రత్యేక వంగడాలు సిగరెట్, బీడి, హుక్కా నమలటం, నశ్యం పొగాకుకు దొరుకుతాయి. పొగాకు కింద వున్న మొత్తం విస్తీర్ణంలో 25% ఎఫ్.సి.వి.కింద 31% బీడి, 26% నమిలేది, హుక్కా 7.5% నాటు, 10.5% చుట్ట, చెర్రూట్లు లంక, బ పొగాకులు సాగు చేయబడుతున్నాయి. పొగాకు పంటలో ఎరువుల యాజమాన్యం.!

**సాగుచేసే వంగడాలు:**

ఆంధ్రప్రదేశ్లో ప్రధానంగా సిగరెట్ పొగాకు, నాటు పొగాకు, బర్లీ పొగాకు, బీడి పొగాకు సాగు చేస్తారు.

**సిగరెట్ రకాలు:**

ముఖ్యమైన సాగుచేసే వంగడాలు: ఎఫ్.సి.వి. పొగాకు, కేంద్రపోగాకు పరిశోధన సంస్థ (సి.టి.ఆర్.ఐ) స్పెషల్, కనకప్రభ, ధనబాయి, డెలెస్ట్, వర్జీనియాగోల్డ్, వైట్ గోల్డ్, 16/103 నాటు పొగాకు రకాలు: తోక ఆకు యన్ -1, కర్ర విత్తనం యన్-2, నీటివిత్తనం, కందుకూరు పెద్ద, సురకత్తి, జవలన్, ఏనుగుదేవి, సంఘుమెడ విత్తనం, గొర్రెగొమ్ము, డి.జి. -3, యన్.జి-3, డి.ఆర్ 1. బర్లీ పొగాకు రకాలు: అతి సామాన్యంగా పెంచే వంగడాలు: 1. బర్జీ-21, 2. కెపై-8 3. కెపై-16,4, హెచ్.డి.బి.ఆర్.జి.

తలలు నరకటం, పిలకలు తీసివేయటం: (ట్రాపింగ్, డిసక్కరింగ్)

తల నరకడం (టాపింగ్) చర్యలో పుష్పగుచ్ఛం బయటకు వచ్చే ముందుగాని, వచ్చిన తరువాత గానీ కొనమొగ్గను తీసివేయడం జరుగుతుంది. తలనరికిన తర్వాత గ్రీవపు మొగ్గలు క్రియాశీలమై పిలక అనే ప్రకాండాలను ఉత్పత్తి చేస్తాయి. పిలకలు తీసివేయటాన్ని "డీ సక్కరింగ్" అంటారు. తల నరకటం పిలకలు తీసివేయటం. లక్ష్యం, మొక్క పోషకాలను పుష్పాలకు విత్తనాలకు పోకుండా ఆకులకు మళ్ళించటమే. ఫలితంగా ఆకు పరిమాణం పెరుగుతుంది. పొగాకు దిగుబడి, నాణ్యత పెరుగుతాయి.

మొదటి పువ్వు తెరుచుకున్నప్పుడు మామూలు టాపింగ్ క్రింద తక్కువ టాపింగ్తో పోలిస్తే అదే సమయంలో చేస్తారు. కానీ అదే సమయంలో మరో 2 ఆకులు ఎక్కువ తీస్తారు. టాపింగ్ లేనిదానితో పోలిస్తే గరిష్ట క్యూరింగ్ చేసిన ఆకు దిగుబడి లభిస్తుంది. అయితే తేలిక నేలల్లో పెంచిన ఎఫ్.సి.వి.పొగాకును మాత్రమే టాపింగ్ చేస్తారు.

కానీ ఇదే పొగాకు భారీ నేలల్లో లేదా ఎరువు వేసిన నేలల్లో టాపింగ్ చేయరు. పిలకలు పట్టుకోవడానికి వీలుగా ఉండే పరిమాణం చేరుతుండగా సాధారణంగా 2,3 సార్లు పిలకలను చేతితో తీసిస్తారు. పిలకలు తొలగించిన వెంటనే ఆకు, కాండం కలిసి చోట ఒక చుక్క కొబ్బరి నూనె వేసి పిలకలను అదుపులో ఉండవచ్చు. ఈ నూనె గ్రీవపు మొగ్గల అభివృద్ధిని నిరోధిస్తుంది. అయితే ఆకులపై పడినచో ఆకు నాణ్యత దెబ్బతింటుంది. అందువలన సి.టి./ఆర్. ఐ వాళ్ళు 'సక్కరవుట్ 3.5% మొక్కకు 10 మిల్లీలీటర్లు చొప్పున పైనుండి 5-6 ఆకుల మొదళ్ళలో వేయుట ద్వారా లేక వేప నూనె ఎమల్షన్ రసాయనం వాడుట ద్వారా పిలకలను నిరోధించవచ్చును.

పంట బాగా పెరిగితే టాపింగ్ ఆలస్యంగా చేయడం మంచిది. ఉత్తరం వైపు తేలిక నేలల్లో సాగుచేసి పొగాకులో బడ్ టాపింగ్ 24 ఆకులు ఉంచి, తరువాత దక్షిణ వైపు తేలిక నేలలు, సాంప్రదాయ నల్లనేలల్లో లేత ఆకుపచ్చ రకాలను మొదటి పుష్పం విచ్చుకునే దశలో, నీటి ఆధారిత / వర్షాధార నాటు పొగాకులో 14-16. ఆకులు ఉంచి, లంక పొగాకులో 12-14 ఆకులు ఉంచి మిగిలినవి తీసేస్తారు. బర్జీ పొగాకులో గోదావరి జిల్లా, గుంటూరు, తెలంగాణాలో వరుసగా 21-24 ఆకుల స్థాయి వద్ద, 14-16 ఆకుల స్థాయివద్ద, 24-26 ఆకుల వద్ద చేస్తారు.



# యంత్రాలతో చెరకు కోత ఎంతో మేలు..!



యంత్రాలతో చెరకు నరికించటానికి అనువుగా నాట్లు వేయడం చాలా ముఖ్యం. గతంలోలాగా చెరకు నరికే కూలీలు లభ్యం కావటం లేదు. రైతుకు ఏడాది పాటు చెరకు పెంచడం ఇబ్బందిగా ఉండటం లేదు కానీ, పండించిన చెరకును నరికించి, ఫ్యాక్టరీకి తరలించటం కష్టంగా మారింది. తెలుగు రాష్ట్రాల్లో టన్నుకు రూ. 600 లు చెల్లించినా కూలీలు లభించని సందర్భాలు నెలకొన్నాయి. చివరికి పండించిన చెరకును తగలబెట్టి నరికించి, ఫ్యాక్టరీలకు తరలిస్తున్నారు. కూలీల కొరత చెరకు పెంచటానికి అదనపు ఖర్చుకు రైతు వెనకాడటం లేదు కాని, నరి కించి ఫ్యాక్టరీకి తరలించడానికి అనేక అవస్థలు పడాల్సివస్తుంది. దీంతో చెర కుసాగు పట్ల విముఖత కలుగుతోంది. కొందరు రైతులు చెరకు సాగుకు స్వస్తి పలుకుతున్నారు. అందుకు కారణం చెరకు నరికి, ఫ్యాక్టరీలకు తరలించే కూలీలు లభ్యం కాకపోవటమే. ఫలితంగా చెరుకుసాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గి, చెరకు ఉత్పత్తి తగ్గిపోతుంది. క్రషింగ్కు అవసరమైన చెరకు లభ్యంకాక నిర్ణీత వ్యవధి వరకు ఫ్యాక్టరీలు కూడా క్రషింగ్ చేయడంలేదు. కొన్ని ఫ్యాక్ట రీలు పూర్తిగా మూతపడుతున్నాయి.

చెరకు సాగువల్ల లాభపడేది రైతు ఒక్కడే కాదు. క్రషింగ్ జరిపిన ఫ్యాక్టరీ, ప్రభుత్వాలు కూడా లాభపడతాయి. అలాంటి చెరకు విస్తీర్ణం రోజు రోజుకు తగ్గటం వల్ల, ఫ్యాక్టరీలకు, ప్రభుత్వా లకూ నష్టమే. రైతు చెరకును వదిలేసి మరో పంట పండించుకోగలడు. ఫ్యాక్టరీ చెరుకు లేకుంటే మూత పడడం తప్ప మరో పంటను క్రషింగ్ చేసే అవకాశం ఉండదు. అలాగే చెరకు ద్వారా లభించే ఆదాయం మరే పంటతో ప్రభుత్వానికి సమకూరదు. ఇన్ని విధాలా నష్టపరుస్తున్న చెరకు నరికే కూలీలకు ప్రత్యామ్నాయం చెరకు నరికే యంత్రాలే. వాటిని ప్రోత్సహించటం చాలా అవసరం. యంత్రాలతో అనేక లాభాలు: యంత్రాలతో చెరకు నరికించడం వల్ల రైతుకు ఎన్నో లాభాలున్నాయి. మనుషులతో చెరుకు నరికించడం ఆలస్యంగా జరిగే ప్రక్రియ. 40 టన్నుల చెరకును మనుషలతో నరికించాలంటే 50 నుంచి 60 మంది అవసరమవు తారు. అంతమందిని ఒకేసారి సమకూర్చటం సాధ్యం కాదు. రైతులు 10 నుంచి 15 మంది కూలీలను సమకూర్చుకొని చెరకు నరికించి లారీలతో ఫ్యాక్ట రీకి తరలిస్తున్నారు. ఒకరిద్దరు నరికిన చెరుకును బండ్లతో ఫ్యాక్టరీకి తరలిం చినా, ఎక్కువమందితో నరికించి లారీలతో ఫ్యాక్టరీలకు తరలించినా, నరికిం చిన చెరకు కనీసం రెండు రోజుల తర్వాత గాని ఫ్యాక్టరీకి చేరదు. ఈ రెండు రోజులు చెరకు ఆరిపోవటం వల్ల బరువు తగ్గి, రసనాణ్యత క్షీణించి, పంచ దారి దిగుబడి శాతం తగ్గుతుంది. ఇలాంటి తరుగుదల రైతుకు, ఫ్యాక్టరీకి కూడా నష్టమే.యంత్రాలతో చెరుకు నరికించటం వల్ల ఈ తరుగుదలేవీ ఉండవు. నరి కించిన చెరకు రెండు లేదా మూడు గంటల వ్యవధిలో ఫ్యాక్టరీకి చేరుతుంది. ఎకరంలోని చెరకు నరకటానికి సుమారుగా మూడు గంటలు పడుతుంది. ఒక చిన్నపాటి యంత్రం ఒక రోజులో 10 నుంచి 15 ఎకరాల్లోని చెరుకును నరికించి, ఫ్యాక్టరీకి తరలించే వీలుంది. యంత్రాలకు అనుబంధంగా ట్రాలీలుం టాయి. అవి నరికిన చెరకు ముక్కలను అందుబాటులో ఉన్న లారీలకు చేర్చు తాయి. రైతుకు శ్రమ తగ్గుతుంది. పని త్వరగా పూర్తవుతుంది. చెరుకు దవ్వ, పండిన, ఎండిన చెరుకు కూడా ఫ్యాక్టరీకి తరలిపోయి కొద్దో గొప్పో అదనపు తూకం రావటానికి వీలుంది. యంత్రాలతో చెరకు నరికించటం వల్ల మరో లాభం కూడా రైతు కుంది. కూలీలతో చెరకు నరికించిన తర్వాత ప్రతి ఎకరంలోను 4 నుంచి 5 టన్నుల వరకు ఎండాకు పొలంలో మిగిలిపోతుంది. దాన్ని కాల్చి వేయటం మినహా రైతుకు మరో దారిలేదు. యంత్రాలతో నరికించిన పుడు ఎండాకు రెండంగుళాలు ముక్కలుగా నరకబడుతుంది.

# పెరటికోళ్ల పెంపకం..!




పెరట్లో సాధారణంగా నాటు కోళ్లను పెంచుకుంటారు. నాటుకోళ్లలో ఉత్పాదక శక్తి తక్కువ. పుంజులు 2.5-3.5కి, పెట్టలు 1.5 -1.8 కి. వరకు బరువు పెరుగుతాయి. సాలిన పెట్టలు 40-50 గుడ్లను మాత్రమే పెడతాయి. వీటిలో పొదిగే లక్షణం ఎక్కువ. కొక్కెర, మాశుచి వ్యాధులు సోకినప్పుడు 40-60 శాతం దాకా చనిపోతాయి. ఇంటి పరిసరాల్లోని, వంటింట్లోని ఆహార పదార్థాల్ని తిని పెరుగుతాయి గనుక వీటి మాంసం, గుడ్లలో ఎలాంటి పురుగు మందుల అవశేషాలు ఉండవు. అందుకే వీటికి డిమాండ్ పెరుగుతుంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని నాటుకోళ్లను సంకరపరిచి పెరట్లో లాభసాటిగా పెంచుకునే కోళ్ల రకాలను అభివృద్ధి చేశారు.

రాజశ్రీ:- పశువైద్య కళాశాల తిరుపతి, రాజేంద్రనగర్ లో లభిస్తాయి. 160 రోజుల నుంచి గుడ్లు పెట్టడం మొదలెట్టి సాలిన 180 గుడ్లు పెడతాయి. గుడ్లు బరువు 53 గ్రా.


వనరాజు,గ్రామప్రియ, కృషిబ్రో:- ఈ మూడు రకాలు కోళ్లు హైదరాబాద్ లోని కోళ్ల ప్రాజెక్టులో లభిస్తాయి. వనరాజు కోళ్లు 130-150 రోజుల నుంచి గుడ్లు పెట్టడం మొదలెట్టి సాలిన 140-150 గుడ్లు పెడతాయి. గుడ్లు 55-63 గ్రా బరువుంటుంది. గ్రామప్రియ కోళ్లు 150 రోజుల వయసు నుంచి మొదలెట్టి సాలిన 160-180 గుడ్లు పెడతాయి. కృషిబ్రో రకం పెరట్లో పెంచటానికి అనువైన బ్రాయిలర్ కోడి రకం.గిరిరాజు, స్వర్ణధార:- ఈ రెండు రకాల కోళ్లు కె. వి. ఎ., ఎఫ్. ఎస్. ఓ, బెంగళూర్ వారి వద్ద లభిస్తాయి. 150 రోజుల వయసు నుంచి గుడ్లు పెట్టడం ప్రారంభించ సాలీన గిరిరాజు రకం 160-170 స్వర్ణధార రకం 180-190 గుడ్లు పెడతాయి. ఇజత్ నగర్ లోని సెంట్రల్ ఏవియేషన్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ వారు క్వారినిర్ బిక్, క్వారిశ్యాము, హిట్ క్వారి కోళ్ల రకాలను అభివృద్ధి చేశారు.అభివృద్ధి చేసిన పెరటికోళ్లు ఎక్కువ బరువు తుగతాయి. ఆకర్షణియంగా ఉంటాయి. గుడ్లు ఉత్పత్తి, వ్యాధి నిరోధికశక్తి ఎక్కువ. సాలిన 160-180 గుడ్లు పెడతాయి. 3.5 నుంచి 4.5కిలోల బరువు తుగతాయి. ఐదు, ఐదున్నర మాసాల వయసు నుంచి గుడ్లు పెట్టడం ప్రారంభిస్తాయి. ఈ కోళ్లు గుడ్లను పొదగలేవు గనుక దేశీయ కోళ్లతో లేదా ఇంక్యూబేటర్ తో పొదిగించాలి. వ్యాధులు:- ఆరుబయట తిరిగే కోళ్లలో అంతర పరాన్నజీవుల నివారణకు ప్రతి 2 నెలలకోసారి డీవార్మింగ్ మందులు వాడాలి. ఒక రోజు వయసు కోడిపిల్లకు మెరెక్స్ టీకా, 7 వ రోజు ఆర్. డి. టీకాను వేయాలి. ప్రతికోడికి 3-4 గ్రా. చొప్పున సున్నపురాయి పొడి లేదా అల్చిప్పల పొడి అందిస్తే తగినంత కాల్షియం లభించడంతో తోలు గుడ్లు పెట్టావు. పేలు నివారణకు బుటాక్స్ మందునీళ్లు షెడ్లో పెట్టాలి.

# పసుపు రంగు మిర్చి



హైదరాబాద్, ఏప్రిల్ 17 (నమస్తే తెలంగాణ): పచ్చిమిర్చి ఆకుపచ్చ రంగులో, ఎండుమిర్చి ఎరుపు రంగులో ఉండటం చూశాం. కానీ, పసుపు రంగులో ఎండు మిరపను చూశారా? ఖమ్మం జిల్లా తిప్పారెడ్డిగూడేనికి చెందిన ఉపేందర్ పసుపు రంగు మిర్చిని సాగు చేస్తున్నాడు.ఎకరంలో సాగుచేయగా 18 క్వింటాళ్ల దిగుబడి వచ్చినట్టు ఆ రైతు తెలిపాడు. ఔషధ గుణా లు ఉన్న ఈ మిర్చి కొనుగోలుకు వ్యాపారులు పోటీ పడుతుండటంతో క్వింటా రూ.70 వేలు పలుకుతున్నది.నిరుడు అక్టోబర్, నవంబర్లో పసుపురంగు మిర్చి ధర క్వింటాకు రూ.1.25 లక్షలు పలికినట్టు రైతు ఉపేందర్ తెలిపారు. తన పంటను ఇప్పు డు విక్రయించకుండా అధిక ధర కోసం కోల్డ్ స్టోరేజీలో నిల్వ ఉంచినట్టు చెప్పాడు. పసుపురంగు మిర్చి సాగుకు ఇతర ప్రాంతాల రైతులు ఆసక్తి చూపుతున్నారు.

## ఉసిరి పొడి.. సరికొత్త రాబడి..
## అధునాతన టెక్నాలజీని ఆవిష్కరించిన సీఎఫ్టీఆర్ఐ



సహజ ఆహార ఉత్పత్తులకు ఇటీవల కాలంలో విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. దీంతో ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీని శాస్త్రీయంగా అభివృద్ధి చేసేందుకు హైదరాబాద్ కేంద్రంగా కృషి చేస్తున్న సెంట్రల్ ఫుడ్ టెక్నోలాజికల్ రిసెర్చ్ ఇన్స్టిట్యూట్ (సీఎఫ్టీఆర్ఐ).. తాజాగా ఉసిరికాయల పొడిని ఆధునిక విధానంలో తయారు చేసేందుకు సరికొత్త టెక్నాలజీని ఆవిష్కరించింది. స్వయం ఉపాధి సంఘాలతోపాటు యువ పారిశ్రామికవేత్తలకు సరికొత్త ఉపాధి అవకాశం లభిస్తుందని సీఎఫ్టీఆర్ఐ వర్గాలు పేర్కొన్నాయి.

ఆధునిక పద్ధతిలో ఉసిరిపొడి తయారీ

ఉసిరికాయలను కొనేముందు క్వాలిటీని చెక్ చేసుకొంటారు.

70-80 డిగ్రీల ఉష్ణోగ్రత ఉన్న వేడి నీటిలో శుభ్రం చేస్తారు.

8-10 గంటలపాటు 40-50 డిగ్రీల ఉష్ణోగ్రత ఉండే ప్రత్యేక క్యాబినెట్ డ్రైయ్యర్స్‌ను వినియోగించి ఎండబెడతారు.

ఇలా ఎండిన కాయలను పొడిగా మారుస్తారు.

అంతర్జాతీయ ఫుడ్ ప్రాసెసింగ్ నిబంధనల ప్రకారం తయారు చేసే ఈ పొడిని ఎగుమతి చేసుకోవచ్చు.

# రోడ్లపై సంతలు - ఇబ్బందుల్లో వాహణదారులు





- రోడ్లపై వ్యాపారాలతో రాకపోకలకు అంతరాయ. ప్రమాధాల భారీన పడుచున్న వాహణదారులు
- సంతల ఏర్పాటుపై నిర్లక్ష్యం నీడలు పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- వారాంతపు సంతల నిర్వాహణపై రైతులకు ప్రజలకు అవగాహణ కల్పించాలి
- లక్షల్లో ఆదాయమున్న కనీస వసతులు లేవు
- సంతల నిర్వహణకు అనువైన విశాల ప్రదేశాన్ని కేటాయించాలి
- రోడ్లపై సంతల నిర్వహణకు అనుమతించ వద్దు

హైదరాబాద్(ప్రశ్న న్యూస్)నిత్యావసర వస్తువుల నుండి మొదలుకొని కూరగాయల కొనుగొళ్ళ వరకు నిర్వహించే వారాంతపు సంతలతో ప్రజలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయి. కుటుబానికి అవసరాల కోసం వారానికి సరిపడే నిత్యావసర సరకులు కూరగాయలు ఒకేసారి తెచ్చుకునేందుకు ఈ వారాంతపు సంతలు ఎంతో సౌకర్యవంతంగా ఉంటున్నాయి. కాని వీటి నిర్వాహణలో చోటు చేసుకుంటున్న నిర్లక్ష్యంతో వారాంతపు సంతలను రోడ్లపై నిర్వహిస్తుండడం వల్ల రహధారులపై ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమై గందరగోళ పరిస్థితులు నెలకుంటున్నాయి. జీహెచ్ఎంసీతో పాటు మున్సిఫల్ కార్పోరేషన్లు, మున్సిపాలిటీలోని కాలనీలలో వారాంతపు సంతలను నిర్వాహణకు సరైన స్థలాలు లేకపోవడంతో ప్రధాన రహదారులు, వీధుల్లో విక్రయాలు చేస్తున్నారు.

వందలాది మంది గుంపులుగా రోడ్లపై రావడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. సంతల నిర్వాహణతో ఘణనీయంగా వినియోగదాల సంఖ్య పెరుగుతున్నా కనీస వసతులు మాత్రం కల్పించడం లేదు. ఏళ్లు గడుస్తున్నను పరిస్థితుల్లో మాత్రం మార్పురావడం లేదు. ముఖ్యంగా సంతల నిర్వహణకు స్థలాల ఎంపిక చేయకపోవడమే ప్రధాన కారణమని ప్రజలు విమర్శిస్తున్నారు.

**లక్షల్లో ఆదాయం సౌకర్యాలు సూన్యం**

వారాంతపు సంతల ద్వారా మున్సిపాలిటీలకు భారీగా ఆదాయం సమకూరుతున్నను క్రయవిక్రయాల కోసం వచ్చే వ్యాపారులకుగానీ, ప్రజలకు గానీ కనీస సౌకర్యాలు కల్పిచడంలో అధికారులు పూర్తిగా విఫలమైన్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. అలాగే వారాతంపు సంతలలో నిత్యావసర సరుకులను కొనుగోలు చేసేందుకు వచ్చే ప్రజలకు, తమ ఉత్పత్తులను విక్రయించుకునేందుకు దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు రైతులకు కనీస ఏర్పాట్లు చేయడంలో సంబందిత అధికారులు పూర్తిగా విఫలమైన్నారని ప్రజలు తీవ్రంగా విమర్శస్తున్నారు. ముఖ్యంగా సంతల నిర్వాహణకై విశాలమైన స్థలాన్ని కేటాయించాల్సి ఉండగా దీనిపై అధికారుల ఆలసత్వం, నిర్లక్ష్యం వల్ల రోడ్లకిరువైపుల కూరగాయలు, పండ్లు, ఇతర నిత్యావసర వస్తువులను కుప్పలుగా పోసి విక్రయిస్తు వాహణాల రాకపోకలకు తీవ్ర విఘాతం కలిగిస్తుండడం గమనార్హం.

**వారాంతపు సంతల నిర్వహణపై అవగాహన కల్పంచాలి**

వారాంతపు సంతల్లో క్రయవిక్రయాల సంతల నిర్వాహణపై రైతులకు, ప్రజలకు సరైన అవగాహణ కల్పించాల్సి ఉంది. సంత నిర్వాహణ పరిధిలో మౌలిక వసతుల కల్పన, ఇతర అత్యవసర పరిస్థితులపై పాటించాల్సిన జాగ్రత్తలపై పూర్తి స్థాయిలో అవగాహణ కల్పించాలి.

అంతకంటే ముందు సంత నిర్వహించే స్థలం ఎంపిక చేసి సంబందిత అధికారులచే అనుమతులు పోందాల్సి ఉంది. కాని వీటిపై అధికారులు పెద్దగా చర్యలు తీసుకోవడం లేదు. అయితే ఏళ్లు గడుస్తున్నా కనీసం సంతలు జరిగే చోట ఎలాంటి చర్యలు చేపట్టడంలేదు. కనీసం తాగునీటి వసతి, మూత్రశాలలు, చెత్త వేసేందుకు స్థలం, పార్కింగ్ సౌకర్యాలు కూడా లేని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైన సంబందిత అధికారులు స్పందించి రోడ్లపై నిర్వహిస్తున్న వారాంతపు సంతలతో ఉత్పన్నమవుచున్న అవాంతరాలు, ఆసౌకర్యాలపై దృష్టి సారించి రోడ్లపై వారాంతపు సంతలపై సరైన విధంగా ఆలోచించి వీటివల్ల ప్రజలకు ఎదురవుచున్న ఇబ్బందులు పరిష్కరమయేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుచున్నారు.

# భట్టివిక్రమార్కతో నవీన్ యాదవ్ భేటీ

## ప్రజల ఆశీర్వాదంతో విజయం సాధించాలని ఆకాంక్ష



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో నవీన్ యాదవ్ అద్భుతమైన ఆధిక్యంతో గెలుపొందడం ఖాయమని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం అభ్యర్థిగా నవీన్ యాదవ్‌ను ప్రకటించిన తర్వాత ఆయన భట్టివిక్రమార్కను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నవీన్ యాదవ్ పార్టీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఎన్నికల సన్నాహాలు, ప్రజల అభిప్రాయాలు, నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. నవీన్ యాదవ్‌కు మల్లు భట్టి విక్రమార్క పూర్తి మద్దతు ప్రకటించారు. ప్రజల ఆశీర్వాదంతో విజయం సాధించాలని ఆకాంక్షించారు.

# రాష్ట్రవ్యాప్తంగా జరిగే బీసీ బందుకు మా మద్దతు

## ఓయూ ఐక్య విద్యార్థి సంఘాలు



ఓయూ (ప్రశ్న న్యూస్) రాష్ట్రవ్యాప్తంగా జరిగే బిసి బందుకు పిలుపు నిచ్చిన రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్యకు మద్దతుగా ఓయూ ఐక్య విద్యార్థి సంఘాల సంపూర్ణ మద్దతు తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ ప్రాంగణంలో విలేకరులు ఏర్పాటు చేసిన సమావేశంలో ఓయూ ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతుఈనెల14న రాష్ట్రవ్యాప్తంగా జరిగే బిసి బందుకు పిలుపు నిచ్చిన రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్యకు మద్దతుగా ఓయూ ఐక్య విద్యార్థి సంఘాల సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపాయి. ఓయూ ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతు కామారెడ్డి డిక్లరేషన్లో ఇచ్చిన హామీ 42 శాతం బిసి రిజర్వేషన్లను అమలు పరచకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఓయూ ఐక్య విద్యార్థి సంఘాలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగింది. 42 శాతం బిసి రిజర్వేషన్ల అంశాన్ని రాజకీయ జాప్యం చేయకుండ త్వరగా అన్ని రాజకీయ పార్టీలు కలిసి రాజకీయ పరిష్కరాన్ని చూపాలని డిమాండ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బొల్లేపల్లి స్వామి గౌడ్, ఎస్ నాగేశ్వర్ రావు, డాక్టర్ లక్ష్మిగారి ఆంజనేయులు ముదిరాజ్, ఓయూ శంకర్,నిఖిల్, నరేష్, జూలూరి మహేష్, శ్రీకాంత్, సాయిలు,రజనీకాంత్, రాకేష్, శివ, శ్రవణ్,శ్రీధర్, నగేష్, రాజేష్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

# అట్టహాసంగా యూత్ కాంగ్రెస్ నాయకులు రామ్మూర్తి జన్మదిన వేడుకలు



కొత్తగూడెం (ప్రశ్న న్యూస్) రెవిన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయంలో యువజన కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి కసనబోయిన రామ్మూర్తి జన్మదిన వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు చీకటి కార్తీక్ రామ్మూర్తికి శాలువా కప్పి సన్మానించి, కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. యూత్ కాంగ్రెస్ కొత్తగూడెం నియోజకవర్గ అధ్యక్షులు పాల సత్యనారాయణ రెడ్డి, జనరల్ సెక్రటరీలు గులాం మతిన్, పవన్, ప్రణయ్, సుజాతనగర్ మండల అధ్యక్షులు శ్రీకాంత్ మరియు మండల అధ్యక్షులు శ్రీకాంత్, జీడీ మహేష్, యూత్ కాంగ్రెస్ శ్రేణులు, మరియు తదితరులు పాల్గొన్నారు.

## విజయ్ రెడ్డి భౌతిక కాయానికి ఏనుగు మనోహర్ రెడ్డి నివాళులు



వేములవాడ (ప్రశ్న న్యూస్)వేములవాడ పట్టణంలోని బాలానగర్ లో అనారోగ్యంతో శనివారం మృతి చెందిన తిరుమల్ రెడ్డి విజయ్ రెడ్డి భౌతిక కాయానికి బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి నివాళు లర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. వారి వెంట బార్ అసోసియేషన్ అధ్యక్షులు గుడిసె సదానందం, రాయపు రెడ్డి, థామస్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, సునీల్ రెడ్డి, యాశ్వంత్ రెడ్డి, గుడిసె దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

# లై'సెన్స్' లేదు




- అనుమతులు లేకుండానే ఇండ్లు, దుకాణాల మధ్యనే పాత ఇనుప దుకాణాలు
- దొంగ సామాన్ల కొనుగోలుకు అడ్డాగా మారిన దందా
- చెత్తే కదా అని వదిలేస్తే కోట్లకు పడగలెత్తుతున్న వ్యాపారాలు
- క్రయవిక్రయాలకు అంశాలను నమోదు చేయని స్క్రాప్ సెంటర్ల నిర్వాహకులు
- అగ్నిప్రమాదం సంభవిస్తే బాధ్యులు ఎవరు.?
- సాయిరాం ఆటోమొబైల్స్ దుకాణంలో దొంగతనం
- స్క్రాప్ సెంటర్ల పై ఉక్కు పాదం మోపుతాం

మేడ్చల్ మున్సిపల్ కమిషనర్ చంద్ర ప్రకాష్ రెడ్డి

" చూడడానికి చెప్పే కానీ కోట్ల సంపాదన తెచ్చి పెడుతుంది. చెత్త అమ్మే వాళ్ళు కదా అని మనము వాళ్లని పెద్దగా పట్టించుకోము కానీ వాళ్ళు కోట్లకు అధిపతులు అంటే ఆశ్చర్యపోతాం. ఎలాంటి లైసెన్సులు లేకుండా ఇళ్ల, దుకాణాల మధ్యన స్క్రాప్ సెంటర్లను కొనసాగిస్తుండడంతో అనుకోకుండా అగ్ని ప్రమాదం సంభవిస్తే భారీ నష్టం చవిచూడక తప్పదని స్థానిక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. స్క్రాప్ దుకాణాల్లో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని సమీపంలోని ఇతర దుకాణాదారులు, స్తానిక ప్రజలు బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారు"







మేడ్చల్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎలాంటి లైసెన్సులు లేకుండా ఇళ్ల దుకాణాల మధ్యన స్క్రాప్ సెంటర్లను కొనసాగిస్తుండడంతో అగ్ని ప్రమాదం సంభవిస్తే భారీ నష్టం చవిచూడక తప్పదని స్థానిక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దొంగ సామాన్లకు అడ్డగా మారిన స్క్రాప్ దుకాణాలతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దీనికి తోడు ఎటువంటి ట్రేడ్ లైసెన్సులు, అగ్నిమాపక రక్షణ చర్యలు లేకుండా ఇళ్ల మధ్యన, ఇతర దుకాణాల సమీపంలో కార్యకలాపాలు కొనసాగిస్తున్నడంతో ఏ క్షణమైనా అగ్ని ప్రమాదం సంభవిస్తే భారీ ప్రాణ ఆస్తి నష్టం చవిచూడక తప్పదని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. పాత సామాన్లను విడివిడి భాగాలుగా మార్చడంతో పాటు ఇనుమును కరిగించేందుకు మంట పెడుతుండడం పరిసర ప్రాంతాలు దట్టమైన పొగ మంచుతో ఊపిరి పీల్చుకునేందుకు కూడా అవస్థలు పడుతున్నారు. మున్సిపల్ చట్ట ప్రకారం ఆన్లైన్ ట్రేడ్ లైసెన్స్ పొందాల్సి ఉంది. అయితే నిబంధనల మేరకు ఎటువంటి లైసెన్సులు పొందకుండానే గత కొన్నేళ్లుగా ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టడమే కాకుండా సాధారణ ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. చట్ట విరుద్ధమైన కార్యకలాపాలకు పాల్పడుతూ పరిశ్రమలలోని వస్తువులను, సెన్సార్ వైర్లను, కేబుల్ వైర్లను, వాహనం మోటార్లను దొంగతనం చేసిన వారిని ప్రోత్సహిస్తూ పబ్బం గడుపుతున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**మేడ్చల్ మున్సిపల్ పరిధిలో సుమారు 100కి పైగా స్క్రాప్ దుకాణాలు..**

మేడ్చల్ పురపాలక సంఘం పరిధిలో సుమారు 100కి పైగా స్క్రాప్ దుకాణాల వరకు ఉన్నాయని, ఏ ఒక్కటి కూడా ట్రేడ్ లైసెన్సులు లేకుండానే వ్యాపారం సాగిస్తున్నారని అధికారులు బాహబాటంగానే చెబుతున్నారు. నెల నెల మామూలు పుచ్చుకొని పరోక్షంగా దుకాణాదరులకు పురపాలక సంఘం కార్యాలయంలో పనిచేసే కిందిస్థాయి అధికారులు సహకరిస్తున్నారని ఆరోపణలు అధికంగా వినిపిస్తున్నాయి. పట్టణంలో కొందరు వాహనదారులకు తమకు విడిభాగాలు కావాల్సి ఉంటే ఈ స్క్రాప్ దుకాణాల వద్ద తమకు కావాల్సిన వస్తువులు దొరుకుతున్నాయని పలువురు మెకానిక్ లు చెప్పడం విశేషం.

**క్రయవిక్రయాలకు అంశాలను నమోదు చేయని స్క్రాప్ సెంటర్ల నిర్వాహకులు..**

స్క్రాప్ సెంటర్లకు సంబంధించి క్రయవిక్రయాలు జరిపిన అంశాలను రికార్డులలో నమోదు చేయాల్సి ఉంటుంది. అయితే అవేవీ పట్టించుకోకుండా ఎంచక్కా తమ వ్యవహారాలు నడిపిస్తున్నారని తెలుస్తున్నది. స్కాప్ లారీలలో పెద్ద ఎత్తున ఇతర ప్రాంతాలకు తరలిపోతున్న వాటిని తనిఖీ చేయకపోవడంతో వారి వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగుతుందని కొందరు పట్టణవాసులు వాపోతున్నారు.

**సాయిరాం ఆటోమొబైల్స్ దుకాణంలో దొంగతనం..**


మేడ్చల్ పారిశ్రామిక వాడలో ఉన్న కానుగుల బుచ్చయ్య అనే వ్యక్తికి సంబంధించిన సాయిరాం ఆటోమొబైల్స్ దుకాణంలోకి ఉదయం 5.16 గంటలకు నలుగురు మహిళలు వెళ్లి తిరిగి 5.19 గంటలకు లోపలికి వెళ్ళిన మహిళలు భారీ సంచులు వారి భుజాలపై ఎత్తుకొచ్చి చెక్పోస్ట్ ప్రాంతంలో ఉండే స్క్రాప్ దుకాణం యజమాని కనకయ్యకు అమ్మినట్లు కనుక్కున్న కానుగుల బుచ్చయ్య వారిని గట్టిగా నిలదీయడంతో చేసిన తప్పు ఆ నలుగురు మహిళలు ఒప్పుకున్నట్లు తెలిపాడు. దీంతో కానుగుల బుచ్చయ్య పోలీసులకు సమాచారం అందించారు.

**స్కాప్ సెంటర్ల పై ఉక్కు పాదం మోపుతాం : చంద్ర ప్రకాష్ రెడ్డి, మేడ్చల్ మున్సిపల్ కమీషనర్**

మేడ్చల్ పురపాలక సంఘం పరిధిలోని ట్రేడ్ లైసెన్సులు లేకుండ నడుస్తున్న స్క్రాప్ దుకాణాలు సెంటర్లు యజమానులకు వెంటనే నోటీసులు అందజేసి త్వరలోనే స్క్రాప్ దుకాణాలపై చట్టరీత్యా చర్యలు తీసుకునే దిశగా ముందుకు సాగుతాం.

# చొరబాట్ల వల్లే ముస్లిం జనాభా పెరుగుతోంది

## అమిత్ షా సంచలన వ్యాఖ్యలు



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)దేశంలో కొన్ని ప్రాంతాల్లో ముస్లిం జనాభా పెరుగుదలకు చొరబాట్లే ప్రధాన కారణమని కేంద్ర హోం మంత్రి అమిత్ షా సంచలన వ్యాఖ్యలు చేశారు. చొరబాట్లను కొన్ని రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకుగా చూస్తున్నాయని ఆరోపించారు. శుక్రవారం నాడు 'దైనిక్ జాగరణ్' మాజీ సంపాదకులు నరేంద్ర మోహన్ స్మారక ఉపన్యాసంలో 'చొరబాటు, జనాభా మార్పు, ప్రజాస్వామ్యం' అనే అంశంపై మాట్లాడుతూ అమిత్ షా ఈ వ్యాఖ్యలు చేశారు. చొరబాటు అనేది కేవలం రాజకీయ అంశం కాదని, ఇది దేశ భద్రతకు, ప్రజాస్వామ్యానికి పెను ప్రమాదంగా పరిణమించిన ఒక జాతీయ సమస్య అని అమిత్ షా స్పష్టం చేశారు. 2011 జనాభా లెక్కల ప్రకారం, అస్సాంలో ముస్లిం జనాభా పదేళ్లలో 29.6 శాతం మేర వృద్ధి చెందిందని అమిత్ షా తెలిపారు. "చొరబాటు లేకుండా ఈ స్థాయిలో వృద్ధి జరగడం అసాధ్యం" అని కేంద్ర హోంమంత్రి నొక్కి చెప్పారు. అలాగే పశ్చిమ బెంగాల్‌లోని అనేక జిల్లాల్లో ముస్లిం జనాభా వృద్ధి రేటు 40 శాతం వరకు ఉందని, సరిహద్దు ప్రాంతాల్లో అయితే అది 70 శాతం వరకు చేరుకుందని షా వెల్లడించారు. గతంలో చొరబాట్లు జరిగాయనేదానికి ఇది అసలైన నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. కొన్ని రాజకీయ పార్టీలు చొరబాటుదారులకు ఆశ్రయం కల్పించి, వారిని ఓటు బ్యాంకుగా పరిగణిస్తున్నందునే ఈ సమస్య మరింత జఠిలమవుతోందని అమిత్ షా ఆరోపించారు. మన దేశంలో గుజరాత్, రాజస్థాన్‌కు కూడా సరిహద్దులు ఉన్నాయన్నారు. మరి ఆ ప్రాంతాల నుండి చొరబాట్లు ఎందుకు జరగడం లేదు అని ఆయన ప్రతిపక్షాలను ప్రశ్నించారు. చొరబాట్లను నిలువరించే బాధ్యత కేంద్రంపై, బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్‌పై ఉందని ప్రతిపక్షాలు వాదిస్తున్నప్పటికీ, కేవలం కేంద్రం ఒక్కటే దీనిని ఆపలేదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers".H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588